వైఎస్ఆర్
# కడప-అన్నమయ్య
తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
మంగళవారం 24 మార్చి 2026





## అర్జీలను పరిష్కరిస్తాం..

కడప కార్పొరేషన్ మార్చి 23 ప్రభాతవార్త:



ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో వచ్చిన అర్జీలకు సంతృప్తి చెందేలా పరిష్కారం చూపుడానికి ప్రయత్నిస్తామని కార్పొరేషన్ సెక్రెటరీ నర్సా రెడ్డి, సూపర్ ఇన్ టెన్డెంట్ ఇంజనీర్ చెన్నకేశవరెడ్డి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ అన్నారెడ్డి విజయ్ కుమార్ రెడ్డి, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ సౌదారి రమేష్‌లు తెలిపారు. సోమవారం కడప నగరపాలక సంస్థలోని సమావేశపు మందిరం నందు..ప్రజా సమస్యల పరిష్కార వేదిక ద్వారా అర్జీల స్వీకరణ కార్యక్రమం జరిగింది. ఈ కార్యక్రమానికి అధికారులు హాజరై ప్రజల నుండి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి అధిక ప్రాధాన్యత ను ఇచ్చి నిర్వహిస్తోందని, ఇందుకు అనుగుణంగా పనిచేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మేనేజర్ విజయ భాస్కర్ గౌడ్, డి ఈ ఈ దిల్షాద్, జెడి నాగమణి, టౌన్ ప్లానింగ్, ఇంజనీరింగ్, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

## ఒంటిమిట్ట బ్రహ్మోత్సవాలకు ఏఎస్పీకి ఆహ్వానం

ఒంటిమిట్ట మార్చి 23 ప్రభాతవార్త



ఆంధ్ర భద్రాద్రి ఏకశిలానగరం ఒంటిమిట్ట శ్రీ కోదండ రామస్వామి బ్రహ్మోత్సవాలకు విచ్చేయాలంటూ సోమవారం ఆలయ అర్చకులు రాఘవాచార్యులు, మరియు ఒంటిమిట్ట సర్కిల్ ఇన్స్పెక్టర్ నరసింహ రాజు రాజంపేట ఏఎస్పి మనోజ్ హెగ్డేకు బ్రహ్మోత్సవాల ఆహ్వాన పత్రికను ఇవ్వడం జరిగింది. ఈ సందర్భంగా వారు టీటీడీ ఆధ్వర్యంలో మార్చి 27 నుంచి 5వ తేదీ వరకు ఒంటిమిట్టలో శ్రీ కోదండ రామస్వామి బ్రహ్మోత్సవాలు నిర్వహిస్తున్నారని ముఖ్యంగా ఏప్రిల్ 01 వ తేదీ శ్రీ సీతారామ కళ్యాణం వైభవంగా నిర్వహిస్తున్నారని కళ్యాణ మహోత్సవానికి రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు వస్తున్నట్లు ఆయనకు తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఒంటిమిట్ట సబ్ ఇన్స్పెక్టర్ శ్రీనివాసులు తదితర పోలీసు సిబ్బంది ఉన్నారు.

## పెండింగ్‌లో ఉన్న వెబ్ ల్యాండ్

# సమస్యలకు పరిష్కారం

**జిల్లా లో పెండింగ్‌లో ఉన్న 10 రెవెన్యూ భూ పట్టాదారులకు 1బి పత్రాలను మంజూరు**

**జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్**



మదనపల్లి, మార్చి 23: ప్రభాతవార్త,

రెవెన్యూ వెబ్ల్యాండ్ సమస్యలను సమగ్రంగా పరిష్కరించేందుకు జిల్లా యంత్రాంగం ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు నిరంతరం చర్యలు చేపడుతోందని,, ఇందులో భాగంగా ఏళ్ల తరబడి పెండింగ్ లో ఉన్న రెవెన్యూ వెబ్లాండ్ సమస్యలకు పరిష్కారం చూపుతూమదనపల్లి, రాయచోటి సబ్ డివిజన్లో 10 వెబ్ ల్యాండ్ 1బి అడంగల్ పత్రాలకు అన్నమయ్య జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ ఆమోదం తెలిపారు. జిల్లా లోని రాయచోటి, మదనపల్లి సబ్ డివిజన్ల పరిధిలో గత అనేక సంవత్సరాలుగా సర్వే నంబర్ సవరణలు, సర్వే నంబర్ అడిషన్స్, అడంగల్ వివరాల సరిదిద్దడంపై పరిష్కారం కోసం కార్యాలయాల చుట్టూ తిరుగుతున్న రైతులకు జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ చూపిన ప్రత్యేక చొరవతో ఏళ్ల తరబడి పరిష్కారం కాని పలు రెవెన్యూ సమస్యలు పరిష్కారం అవుతున్నాయి. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న వెబ్ ల్యాండ్ సమస్యలను ప్రత్యేకంగా పరిశీలించి పరిష్కరించడంతో పాటు మదనపల్లి సబ్ కలెక్టర్, రాయచోటి ఆర్.డి.ఓ ఆమోదించిన 10 వెబ్ ల్యాండ్ 1తీ పత్రాలను అన్నమయ్య జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ ఆమోదం తెలిపారు. ఈ నేపథ్యంలో సోమవారం జిల్లా కలెక్టరేట్‌లోని కోర్ట్ హాల్‌లో ప్రత్యేకంగా నిర్వహించిన కార్యక్రమంలో 10 మంది రైతులకు వెబ్ ల్యాండ్ సమస్యలు పరిష్కరించి సంబంధిత 1బి పత్రాలను జిల్లా కలెక్టర్ రైతులకు అందజేశారు. మిగిలిన దరఖాస్తులపై త్వరితగతిన చర్యలు తీసుకుని పూర్తిస్థాయిలో పరిష్కారం కల్పిస్తామని పేర్కొన్నారు. మదనపల్లి సబ్ డివిజన్ రామసముద్రం,నిమ్మనపల్లె, గుర్రంకొండ, రాయచోటి సబ్ డివిజన్ క్రింద సంబేపల్లి తదితర గ్రా మాలకు చెందిన పలు రెవెన్యూ సమస్యలకు సంబంధించి 1బి పత్రా లను నేడు జిల్లా కలెక్టర్ రైతులకు అందజేశారు. అదే విధంగా 22ఏ భూమి సమస్యలకు సంబంధించి ఈ నెల మొదట వారం లో డెబ్బై రెండు, ఈ వారం లో డెబ్బై 22ఏ భూమి సమస్యలకు పరిష్కారం చూపడం జరుగుతుందని తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూమదనపల్లి, రాయచోటి సబ్ డివిజన్ పరిధిలో వెబ్ ల్యాండ్‌కు సంబంధించి వచ్చిన 10 దరఖాస్తులను సంబంధిత రెవెన్యూ రికార్డులు, పాత దస్త్రాలను క్షుణ్ణంగా పరిశీలించి నిబంధనల ప్రకారం పరిష్కరించినట్లు తెలిపారు. ముఖ్యంగా గత తొమ్మిది నుంచి పది సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను ప్రాధాన్యతగా తీసుకుని త్వరితగతిన పరిష్కారం అందించేందుకు జిల్లా రెవెన్యూ యంత్రాంగం చర్యలు తీసుకున్నదని తెలిపారు. భూమి రికార్డులు సరిగ్గా ఉండటం రైతులకు అత్యంత ముఖ్యమని, భూమి లావాదేవీ లు, పంట రుణాలు, ఇతర ప్రభుత్వ పథకాల లబ్ధి పొందడంలో వెబ్ ల్యాండ్ రికార్డులు కీలక పాత్ర పోషిస్తాయని కలెక్టర్ పేర్కొన్నారు. రెవెన్యూ రికార్డుల్లో ఉన్న లోపాలను సరిచేసి రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చేయడమే జిల్లా పరిపాలన ముఖ్య లక్ష్యమని కలెక్టర్ తెలిపారు. రైతుల సమస్యలను సత్వరమే పరిష్కరించే దిశగా రెవెన్యూ శాఖ అధికారులు మరింత బాధ్యతతో పనిచేయాలని, ప్రజలకు పారదర్శకంగా సేవలు అందించాలని ఈ సందర్భంగా రెవి న్యూ అధికారులకు కలెక్టర్ సూచించారు.ఈ కార్యక్రమంలో జిల్లా జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ రెవెన్యూ శాఖ అధికారులు పాల్గొన్నారు.

## వాణిజ్య రంగాలపై రెవెన్యూ దాడులు

**తూతూ మంత్రంగానేనా?**

**వందకు పైగా సిలిండర్లు గుర్తింపు - కొన్నే సీజ్..**

**అధికారుల చర్యలపై అనుమానాలు**



పులివెందుల, మార్చి 23, ప్రభాతవార్త :

పులివెందుల పట్టణంలో వాణిజ్య వ్యాపార రంగాలపై సోమవారం రెవెన్యూ అధికారుల దాడులు నిర్వహించినప్పటికీ, అవి తూతూ మంత్రంగానే సాగాయని ఆరోపణలు వినిపిస్తున్నాయి. పట్టణంలోని పలు హోటళ్లు, వాణిజ్య సంస్థలపై ఎన్ఫోర్స్మెంట్ డీటీ సుధీర్ తన సిబ్బందితో కలిసి ఆకస్మికంగా తనిఖీలు చేపట్టిన అధికారులు భారీగా గ్యాస్ సిలిండర్ల వినియోగాన్ని గుర్తించినట్లు సమాచారం. తనిఖీలలో భాగంగా సుమారు 100కు పైగా వాణిజ్య, గృహ వినియోగ సిలిండర్లు హోటళ్లు మరియు ఇతర వ్యాపారాల్లో వినియోగిస్తున్నట్లు బయటపడింది. అయితే, అంత పెద్ద ఎత్తున అక్రమ వినియోగం వెలుగులోకి వచ్చినప్పటికీ, కొద్దిపాటి సిలిండర్లను మాత్రమే సీజ్ చేయడం చర్చనీయాంశంగా మారింది.స్థానికుల కథనం ప్రకారం, పలు హోటళ్లలో నిబంధనలు ఉల్లంఘిస్తూ గృహ వినియోగ సిలిండర్లను వాణిజ్య అవసరాలకు ఉపయోగిస్తున్నారని ఆరోపిస్తున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో పూర్తిస్థాయి చర్యలు తీసుకోవాల్సిన అధికారులు పరిమితంగా వ్యవహరించడంపై వ్యాపార వర్గాలు, ప్రజల్లో అనుమా నాలు వ్యక్తమవుతున్నాయి. ఎందుకు కొన్నింటినే స్వాధీనం చేసుకున్నారు? మిగిలిన వాటిపై చర్యలు ఎందుకు తీసుకోలేదు" అనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. కొందరు వ్యాపారులకు అనుకూలంగా వ్యవహరిం చారా అనే అనుమానాలు కూడా వ్యక్తమవుతున్నాయి. ఈ ఘటనపై రెవెన్యూ అధికారులు మాత్రం తమ చర్యలు నిబంధనల ప్రకారం జరిగాయని పేర్కొంటున్నారు. అవసరమైతే మరిన్ని తనిఖీలు చేపట్టి కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు.ఇకపై ఈ వ్యవ హారంపై ఉన్నతాధికారులు స్పందిస్తారా? పూర్తి స్థాయి విచారణ జరుగుతుందా? అన్నది వేచి చూడాల్సి ఉంది.

## చోరీ కేసులో 9 లక్షలు విలువైన..

# బంగారు నగలు స్వాధీనం

**ఇద్దరు నిందితుల అరెస్టు**



రాజంపేట, మార్చి23 ప్రభాతవార్త

ఒకటిన్నర నెల క్రితం రాజంపేట మండలం ఎస్ ఎర్రబల్లిలో జరిగిన ఓ చోరి కేసులో ఎట్టకేలకు ఇద్దరు తమిళనాడు చెందిన ఇద్దరు నిందితులు పోలీసులకు దొరికారు. రాజంపేట ఏఎస్పీ మనోజ్ రామ్నాథ్ హెగ్డే వివరాలు మేరకు గత నెల 6 వ తేదీన పిండి బోయిన మధు ఇంట్లో లేని సమయంలో చోరీ జరిగిందన్నారు. ఈ కేసు చేరించేందుకు టీములు ఏర్పాటు చేశామన్నారు. మన్నూరు సిఐ లింగప్ప, ఎస్సై వెంకటేశ్వర్లు తో పాటు సిసిఎస్ బృందం కూడా నిందితుల కోసం గాలించిందన్నారు. క్లూస్ టీమ్,సాంకేతిక సహకారం తీసుకొని నిందితులను పట్టుకున్నామన్నారు.దర్యాప్తు లో చెన్నై తిరువళ్ళూరుకు చెందిన మాబాషా, జి. సాయికుమార్ అరెస్ట్ చేసి 9లక్షల విలువగల 100 గ్రాముల బంగారు ఆభరణాలు స్వాధీనం చేసుకున్నట్లు చెప్పారు. చోరీ కేసులో బాగా పనిచేసిన సిఐ లింగప్ప, ఎస్సై వెంకటేశ్వర్లు, సిసిఎస్ బృందాన్ని ఏఎస్పీ అభినందించారు.

## ప్రజల సమస్యలు పరిష్కరించేందుకే

# ఇంటింటికి తెలుగుదేశం

**టిడిపి అసెంబ్లీ ఇన్చార్జ్ జగన్మోహన్ రాజు**



రాజంపేట, మార్చి23 ప్రభాతవార్త

ప్రజల సమస్యలు పరిష్కరించేందుకే ఇంటింటికి తెలుగుదేశంఖి కార్యక్రమం చేపట్టినట్లు రాజంపేట టిడిపి అసెంబ్లీ ఇన్చార్జ్ జగన్మోహన్ రాజు పేర్కొన్నారు. సోమవారం రాజంపేట పట్టణంలోని రామ్ నగర్ లో ఆయన పర్యటించారు. ఇంటింటికి వెళ్లి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రధానంగా మహిళలతో మమేకమై సమస్యలను ఆరా తీశారు.ప్రజల కోసం ప్రజల చెంతకు అనే నినాదంతో ఈకార్యక్రమం నిర్వహిస్తున్నమన్నారు. అధికారమే పరమావధిగా కాకుండా సామాన్యుడి కష్టాన్ని తెలుసుకోవడం లక్ష్యంగా పని చేయాలని పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు ఇచ్చిన పిలుపుమేరకు ప్రతి ఇంటి తలుపు తడుతున్నారు. ఈ సందర్భంగా చమర్తి మాట్లాడుతూ ప్రజా సమస్యల పట్ల అధికారులు తక్షణమే స్పందించాలని,ప్రజా సమస్యల పరిష్కారం కొరకు తాను ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటానని ఏ సమయంలోనైనా తనను సంప్రదించవచ్చని ప్రజలకు తెలియజేశారు ఈ కార్యక్రమంలో రాజంపేట పట్టణ పార్టీ అధ్యక్షుడు దగ్గుబాటి సుబ్రమణ్యం, డాక్టర్ నవీన్ , మాజీ అధ్యక్షుడు సంజీవరావు, నరసింహ, మంద శీను, ఎస్కే కరీం, పీరు, తదితర పార్టీ నాయకులు పాల్గొన్నారు.

## పన్నుల వసూలులో లక్ష్యం సాధ్యమేనా..?

**లక్ష్యం రూ.18 కోట్లు**

**ఫిబ్రవరి 23 నాటికి వసూలు రూ.9 కోట్లు**

**సకాలంలో పన్నులు చెల్లించి పంచాయతీ అభివృద్ధికి సహకరించండి**



పీలేరు, మార్చి 23 ప్రభాతవార్త:

సకాలంలో పన్నులు చెల్లించి పంచాయతీల అభివృద్ధికి సహకరించాలని ప్రభుత్వ చెప్పుతోంది. ఇందుకోసం పంచాయతీ రాజ్ శాఖ అధికారులు కృషి చేయాలని ప్రభుత్వం సూచిస్తోంది. ఈ క్రమంలో జిల్లా క్షేత్ర స్థాయిలో ఇది ఆచరణ సాధ్యం కాలేదు. మార్చి నాటికి ఆర్థిక సంవత్సరం ముగియనుంది. గడిచిన 11 నెలల కాలంలో లక్ష్యానికి సగం మాత్రమే చేరువయ్యారు. ఇక మిగిలింది నెల రోజులు మాత్రమే ఈ వ్యవధిలో మిగిలిన రూ.3 కోట్లు పన్నులు వసూలు చేయాల్సి ఉంది. ఇది సాధ్యమయ్యేనా అని సందేహం నెలకొని ఉంది. జిల్లాలో 202526 ఆర్థిక సంవత్సరంలో వసూలు చేయాల్సిన పన్నులు మొత్తం, ఇప్పటి వరకు వసూలైన సన్నుల వివరాలను పరిశీలిస్తే.. జిల్లాలో మొత్తం అసెస్మెంట్లు 1,32,787 పాత బయాయిలు రూ.3 కోట్లు, ప్రస్తుత వసూలు చేయాల్సిన లక్ష్యం 15 కోట్లు వసూలు చేయాల్సిన మొత్తం రూ.18 కోట్లు, ఫిబ్రవరి నాటికి వసూలైన మొత్తం రూ.9 కోట్లు క్యూఆర్ కోడ్ ద్వారా చెల్లింపులు, ప్రజాధనం దుర్వినియోగం కాకుండా ఉండేందుకు కూటమి ప్రభుత్వం తొలిసారిగా క్యూఆర్ కోడ్ ద్వారా పన్నులు చెల్లించే అవకాశం కల్పించింది. ఇందుకోసం ప్రత్యేక యాప్ ను రూపొందించి ప్రజలకు అందుబాటులోకి తీసుకొచ్చారు. పన్నులన్నీ ఆఫ్ లైన్ చెల్లింపులకు స్వస్తి పలుకుతూ ఆన్లైన్లోనే చెల్లించాల్సి ఉంటుంది..

## శ్రీ కోదండ రామస్వామి ఆశీస్సులు ఎల్లవేళలా..

# ప్రజలపై ఉంటాయి

**మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి**



రాయచోటి మార్చి 23 ప్రభాతవార్త

సోమవారం అన్నమయ్య జిల్లా,రాయచోటి మున్సిపాలిటీలోని చిత్తూరు రోడ్‌లో గల ఎస్టీ కాలనీ నందు శ్రీ సీతారామ లక్ష్మణ హనుమాన్ సమేత శ్రీ కోదండ రామస్వామివిగ్రహ ప్రతిష్ట కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమానికి హాజరైన మంత్రి కి పురోహితులు వేద ఆశీర్వచనం చేశారు . స్వామివార్లకు ఆయన పూజలు నిర్వహించిన అనంతరం ఆయన ఈ సందర్భంగా మాట్లాడుతూ శ్రీ కోదండరామ స్వామి ఆశీస్సులు రాష్ట్ర ప్రజలపై ఎల్లవేళలా ఉంటాయని అన్నారు. ఈ కార్యక్రమంలో రాయచోటి మండల టిడిపి అధ్యక్షులు గండికోట సుధాకర్, పట్టణ టిడిపి అధ్యక్షుడు బోనమల ఖాదరవల్లి, మాజీ కౌన్సిలర్ మిట్ట సంజీవరెడ్డి,జయరాం రెడ్డి, డీలర్ శివారెడ్డి, 26 వార్డు ఇన్చార్జి రామాంజనేయులు, వల్లూరు నాగ సుబ్బారెడ్డి, పజిల్ మరియు టీడీపీ నాయకులు,కార్యకర్తలు భక్తులు పాల్గొన్నారు.

## న్యాయం జరగకపోతే..

# ఆత్మహత్యే శరణ్యం

**భూ బాధితురాలు ఆవేదనతో హెచ్చరిక**



కలెక్టర్‌కు విన్నవిస్తున్న దృశ్యం

మదనపల్లె, మార్చి 23 ప్రభాతవార్త :

తనకు ఇస్తామన్న భూమి ఇవ్వకపోతే ఆత్మహత్యే శరణ్యమంటూ భూ బాధితురాలు అజిమున్నీసా తెలిపారు. సోమవారం మదనపల్లె కలెక్టరేట్‌లో జరిగిన పిజిఆర్ఎస్ వేదికలో భూ సమస్యపై జిల్లా కలెక్టర్ నిశాంత్‌కుమార్‌కు ఆమె విన్నవించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పట్టణ సమీపంలోని అమ్మచెరువుమిట్ట వద్ద ఉన్న వెలుగు స్కూల్ వెనుకబాగాన ఉన్న కాలనీలో ప్రభుత్వ నివాస గృహాలకు తమ భూమిని రెవెన్యూ అధికారులు తీసుకొన్నారన్నారు. అయితే మాకు కేటాయిస్తామన్న భూమిని ఇంతవరకు చూపించలేదన్నారు. ఐదేళ్ళుగా రెవెన్యూ కార్యాలయం చుట్టూ తిరుగుతున్నా న్యాయం జరగలేదన్నారు. పదిమందికి చెందిన భూములను అప్పట్లో కాలనీకి తీసుకొన్నారని అయితే 8మందికి వేరేచోట భూమి ఇచ్చారని, తమకు మాత్రం ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. సర్వేనెంబర్ 774/3లో 1.18ఎకరాలు, సర్వేనెంబర్ 891/2లో 30సెంట్లు తీసుకొన్న భూమికి ఇప్పటి వరకు ఇచ్చిన హామీ మేరకు స్థలాలు కేటాయించలేదని ఆమె తెలిపారు. ఉన్నతాధికారులు స్పందించి న్యాయం చేయాలని ఆమె వేడుకొన్నారు.

## రాష్ట్ర మంత్రి మండిపల్లి రామ్‌ప్రసాద్‌రెడ్డికి ఘనసన్మానం



మదనపల్లె, మార్చి 23 ప్రభాతవార్త :

రాష్ట్ర రవాణా, క్రీడల శాఖామంత్రి మండిపల్లి రామ్‌ప్రసాద్‌రెడ్డిని గొళ్ళపల్లె గ్రామ పంచాయితీకి చెందిన టిడిపి నాయకులు ఘనంగా సన్మానించారు. బి.కొత్తకోట మండలం గొల్లపల్లె గ్రామంలోని దేవళంగడ్డలో శ్రీశ్రీ ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయ పున:నిర్మాణాన్ని గ్రామస్థులు చేపట్టారు. ఆలయ భక్తుల కోరిక మేరకు సోమవారం మంత్రి రామ్‌ప్రసాద్‌రెడ్డి ఆలయానికి విచ్చేశారు. ఈసందర్భంగా మంత్రి ఆలయంలో స్వామివారి మూల విగ్రహ ప్రతిష్ట మహోత్సవం కార్యక్రమంలో పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. ఆలయ అర్చకులు పూర్ణకుంభంతో మంత్రికి ఘనస్వాగతం పలికారు. అనంతరం తెలుగుదేశం పార్టీకి చెందిన కనికలతోపు రైస్‌మిల్ ప్రకాష్, ముట్రవారిపల్లె శివరామిరెడ్డి, దిన్నెమీదపల్లె జి.వెంకటేశ్వరరెడ్డి, మదన్‌మోహన్‌రెడ్డిలతో పాటు భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

# దొమ్మేటి వెంకటరెడ్డి ఆశయాలు ఆదర్శప్రాయం

## జిల్లా అదనపు ఎస్పీ యం. వెంకటాద్రి



మదనపల్లెక్రైమ్, మార్చి 23 ప్రభాతవార్త.

సామాజిక సమానత్వం, వెనుకబడిన వర్గాల విద్యాభివృద్ధి కోసం కృషి చేసిన మహనీయుడు, ప్రముఖ సంఘ సంస్కర్త దొమ్మేటి వెంకటరెడ్డి అని అన్నమయ్య జిల్లా అదనపు ఎస్పీ యం. వెంకటాద్రి కొనియాడారు. సోమవారం మదనపల్లెలోని జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో జిల్లా ఎస్పీ శ్రీ ధీరజ్ కునుబిల్లి ఐపీఎస్ ఆదేశాల మేరకు దొమ్మేటి వెంకటరెడ్డి జయంతి పురస్కరించుకొని అయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా అదనపు ఎస్పీ మాట్లాడుతూ దొమ్మేటి వెంకటరెడ్డి కేవలం ఒక్క ప్రాంతానికో లేదా కులానికో పరిమితం కాలేదని, ఆయన సేవలు విశ్వవ్యాప్తమైనవన్నారు. బర్మాలో అగ్రశ్రేణి వ్యాపారవేత్తగా ఎదిగి, అక్కడ మేయర్‌గా బాధ్యతలు చేపట్టి బర్మా కేసరి గా గుర్తింపు పొందడం తెలుగు జాతికి గర్వకారణమన్నారు. గాంధీజీ కంటే ముందే కుల నిర్మూలన, వయోజన విద్య వంటి సామాజిక అంశాలపై పోరాడిన ధీశాలి వెంకటరెడ్డి అని ఆయన గుర్తు చేశారు. విద్యార్థుల భవిష్యత్తు కోసం తన ఆస్తులను, భూములను దానం చేసిన ఆయన గొప్ప మనసు నేటి తరానికి స్ఫూర్తిదాయకం అన్నారు. అటువంటి మహనీయుల ఆశయాలను స్మరించుకుంటూ ముందుకు సాగడం మన అందరి బాధ్యత అని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో డిసిఆర్బి ఇన్స్పెక్టర్ ఏ. ఆదినారాయణ రెడ్డి, మహిళా పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ జి శంకరమల్లయ్య, ఆర్ఎస్ టిఎఫ్ ఇన్స్పెక్టర్ ఏ. మోహన్ కుమార్, పలువురు ఎస్ఐ లు ఆర్ఎస్ఐలు, జిల్లా పోలీస్ కార్యాలయ అధికారులు, పోలీసు సిబ్బంది, మహిళా పోలీసులు, హోంగార్డులు పాల్గొన్నారు.

## జగన్ హయాంలోనే ఆలయాలకు మహర్దశ

విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవంలో పాల్గొన్న మాజీ మంత్రి ఆర్ కె.రోజా



సంబేపల్లి, మార్చి 23 ప్రభాతవార్త

రాష్ట్రంలో జగన్మోహన్ రెడ్డి అధికారంలో ఉన్నప్పుడు ఆలయాలకు మహర్దశ కలిగిందని మాజీ మంత్రి ఆర్కే రోజా పేర్కొన్నారు. సోమవారం సంబేపల్లె మండలం శెట్టిపల్లె గ్రామం తిమ్మక్క గారిపల్లెలో నూతనంగా నిర్మించిన కొండలరాయుడు శ్రీ లక్ష్మీ నరసింహస్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమంలో మాజీ మంత్రి రోజా ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. మూడు రోజులపాటు జరిగే ఈ కార్యక్రమం భక్తిశ్రద్ధల నడుమ అంగరంగ వైభవంగా ప్రారంభమైనది. ఈ కార్యక్రమంలో మంత్రిత్వపాటు రాయలసీమ విద్యాసంస్థల అధినేత యర్రపురెడ్డి ఆనంద రెడ్డి హాజరు అయ్యారు. కార్యక్రమానికి విచ్చేసిన మంత్రి రోజాకు నిర్వాహకులు గొర్ల ఉపేంద్రా రెడ్డి, రమేష్ రెడ్డి, అనిరుధ్ రెడ్డి గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. గ్రామ మహిళలు, ప్రజలతో కలిసి మాజీ మంత్రి ఆర్ కె రోజా పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ నిర్వాహకులు గ్రామస్తులు భక్తులు విశేషంగా పాల్గొన్నారు.

## ఇంజనీరింగ్ వర్క్ షాప్ ప్రారంభోత్సవం



రాయచోటి మార్చి 23 ప్రభాతవార్త

రాయచోటి పట్టణం చిత్తూరు రోడ్డులోని బజాజ్ ఎలక్ట్రానిక్స్ సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన ఏ ఎఫ్ ఎస్ ఇంజనీరింగ్ వర్క్ షాప్ ను రాజంపేట పార్లమెంట్ టీడీపీ అధ్యక్షులు శ్రీ సుగవాసి ప్రసాద్ బాబు ముఖ్య అతిథిగా విచ్చేసి, రిబ్బన్ కట్ చేసి ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా సుగవాసి ప్రసాద్ బాబు మాట్లాడుతూ: యువత ఇటువంటి స్వయం ఉపాధి రంగాల్లో రాణించడం అభినందనీయం. అత్యాధునిక సాంకేతికతతో నాణ్యమైన సేవలను అందిస్తూ, ఈ సంస్థ ప్రజల ఆదరాభిమానాలు పొంది, దినదినాభి వృద్ధి చెందాలని మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను. యాజమాన్యానికి మరియు సిబ్బందికి హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం రాయ చోటి పట్టణంలోని కొత్తపేట రోడ్డులో నూతనంగా ఏర్పాటు చేసిన అభి ఫ్యాషన్ వస్త్ర దుకాణాన్ని ఆయన ప్రారంభించారు.

## ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వినతులు



మదనపల్లెక్రైమ్, మార్చి 23 ప్రభాతవార్త.

మదనపల్లె ఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కు సమస్యల పరిష్కరించాలంటూ పలువురు వినతి పత్రాలు సమర్పించారు. జిల్లా ఎస్పీ అందుబాటులో లేకపోవడం తో అడిషనల్ ఎస్పీ వేంకటాద్రి ఆధ్వ ర్యంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక ను సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వారి సమస్యలను అడిషనల్ ఎస్పీకి విన్నవించారు. పట్టణంలోని బసినికొండకు చెందిన నవీన్, ఏడాది క్రితం కారు డీలర్ మల్లికార్జున వద్ద రూ. 3.60 లక్షలకు 2015 మోడల్ ఇతియోస్ కారును కొనుగోలు చేశానని, అయితే, ఆ కారు ఢిల్లీ రిజిస్ట్రేషన్ నంబర్‌తో ఉండటంతో, దానికి సంబంధించిన ఆంధ్రప్రదేశ్ ఎన్ ఓ సి మూడు నెలలు గడిచినా రాకపోవడంతో, తాను కారును డీలర్ మల్లికార్జున కు తిరిగి ఇచ్చేసానన్నారు. కారు తిరిగి ఇచ్చే సమయంలో డీలర్ మల్లికార్జున కేవలం రూ. 1.50 లక్షలు మాత్రమే చెల్లించి, మిగిలిన మొత్తాన్ని తర్వాత ఇస్తానని కాలయాపన చేస్తూ, ఆదివారం డబ్బులు ఇస్తానని, మదనపల్లికి రమ్మని మల్లికార్జున పిలిచి తనను, తన తల్లి పార్వతమ్మ పై మల్లికార్జున, అతని కుటుంబ సభ్యులు దాడి చేశారని అడిషనల్ ఎస్పీకి ఫిర్యాదు చేశాడు. ప్రజా సమస్యల పరిష్కార వేదిక లో ఫిర్యాదు దారులతో మాట్లాడిన అడిషనల్ ఎస్పీ వారి సమస్యలను విని, అర్జీలపై విచారణ జరిపి, న్యాయం అందించాలని సంబంధిత పోలీసులకు సూచించారు. జిల్లా కేంద్రానికి రాలేకపోయిన ప్రజలు తమ ఫిర్యాదులను దగ్గరలోని పోలీస్ స్టేషన్ లో పిర్యాదు చేసిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక ఫిర్యాదులుగానే పరిగణించి, సకాలంలో న్యాయం అందిస్తామని స్పష్టం చేశారు.

## ఏపీ ఎన్జీజీవోస్ లక్కిరెడ్డిపల్లి అధ్యక్షునిగా సి విశ్వనాధం

సెక్రెటరీగా షేక్ మహమ్మద్ అలీ



లక్కిరెడ్డిపల్లి: మార్చి 23 ప్రభాతవార్త

లక్కిరెడ్డిపల్లి అసోసియేషన్ ఎన్జీజీవోస్ ఎక్స్‌క్యూటివ్ అధ్యక్షులు పోస్ట్ ఖాళీలు ఉండడంతో అబ్జెర్వర్ గా జిల్లా కోశాధికారి నాగేశ్వర్ ని జిల్లా అధ్యక్షులు ఎం వేణు గోపాల్ రెడ్డి నియమించారు. ఈ సందర్భంగా లక్కిరెడ్డిపల్లి నూతన అధ్యక్షులుగా సి విశ్వనాద్ ను , సెక్రటరీ గా షేక్ మహమ్మద్ అలీను, సహధ్యక్షులుగా నాగరాజును, ఉపాధ్యక్షులుగా మహమ్మద్ బాషాను, ఆర్గనైజింగ్ సెక్రెటరీ గా సురేందర్ రెడ్డి ని రాష్ట్ర ఉపాధ్యక్షులు వై ప్రసాద్ యాదవ్, జిల్లా అధ్యక్షులు వేణు గోపాల్ రెడ్డి, జిల్లా కార్యదర్శి శ్రీనివాసన్ ఆధ్వర్యంలో పై వారిని కో ఆప్షన్ పద్దతిలో ఎన్నుకున్నారు. రాష్ట్ర ఉపాధ్యక్షులు వై ప్రసాద్ యాదవ్, జిల్లా వేణు గోపాల్ రెడ్డి మాట్లాడుతూ నూతనంగా ఎన్నుకోబడిన కార్యవర్గానికి శుభాకాంక్షలు తెలియజేస్తూ రాష్ట్ర అధ్యక్షులు అలపర్తి విద్యాసాగర్, ప్రధాన కార్యదర్శి రమణ ఆధ్వర్యంలో ఉద్యోగులకు రావలసిన బకాయిలు ప్రభుత్వం నుండి 20 వేల కోట్లు చెల్లించారని ఇంకా వేతన సవరణ, డీఏ లు, ఉద్యోగులకు రావలసిన ఒక్కొక్క డిమాండ్లను సాధిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సహధ్యక్షులు శివా రెడ్డి ఉపాధ్యక్షులు మహదేవ, తాలూకా నాయకులు రవీంద్ర నాయక్, దానం, రామకృష్ణ, సుబ్బయ్య, గౌసియా, వెంకటలాక్షుమమ్మ, సాహెబ్ పీర్ పాల్గొన్నారు. నూతనంగా ఎన్నుకోబడిన అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ మా మీద నమ్మకంతో ఎన్నుకున్నందుకు రాష్ట్ర మరియు జిల్లా నాయకులకు కృతజ్ఞతలు మరియు ధన్యవాదాలు తెలియజేశారు. కష్టపడి పని చేసి సంఘానికి మరియు ఉద్యోగులకు న్యాయం చేస్తామని తెలియజేశారు.

శ్రీ రామాలయం దేవస్థానానికి భూమి పూజలో పాల్గొన్న

## మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి



చిన్నమండెం మార్చి 23 ప్రభాతవార్త:

20 లక్షల రూపాయలు నిధులతో శ్రీవాణి ట్రస్టు ద్వారా నూతన దేవాలయం నిర్మాణం మండలంలోని ,కలిబండ గ్రామం, కోళ్లవాండ్లపల్లి నందు జరుగుతుంది .సోమవారం జరిగే శ్రీ రామాలయం దేవస్థానానికి నూతన ఆలయ భూమి పూజ కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర రవాణా యువజన క్రీడా శాఖ మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ఈ కార్యక్రమానికి హాజరైన పూజలు చేశారు. ఈ సందర్భంగా మంత్రికి పురోహితులు వేద ఆశీర్వచనం చేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ శ్రీవాణి ట్రస్ట్ ద్వారా ఈ గుడిని అతి త్వరలో నిర్మాణం పూర్తి చేసి గ్రామస్తులు యొక్క వినియోగం కోసం తీసుకురావాలని కోరారు.. ఈ కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షుడు మూగిరెడ్డప్ప, పెద్దిరెడ్డి,రాజు మరియు మండల గ్రామ టీడీపీ నాయకులు, కార్యకర్తలు భక్తులు హాజరయ్యారు.

## రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

తెదేపా కూటమి నాయకులు



పీలేరు మార్చి 23 ప్రభాతవార్త:

పీలేరు మండలంలోని బోడు మల్లు వారి పల్లి పంచాయతీ నందు సోమవారం తెదేపా కూటమి నాయకులు అన్నదాత సుఖీభవ పీఎం కిసాన్ లబ్ధిదారులతో పీలేరు మార్కెట్ కమిటీ చైర్మన్ పురం రామ్మూర్తి , ఉమ్మడి చిత్తూరు జిల్లా జనసేన పార్టీ కార్యదర్శి కలప రవి , పీలేరు మార్కెట్ యార్డ్ డైరెక్టర్ గోల కిషోర్ నాయుడు, కె.విపల్లి మండల క్లస్టర్ ఇంచార్జి వెంకట రత్నం, టిడిపి వెంకటరమణారెడ్డి, వ్యవసాయ అధికారి హిమబిందు గ్రామ రైతులు పాల్గొనడం జరిగింది ఈ కార్యక్రమంలో వారు మాట్లాడుతూ ఉమ్మడి ప్రభుత్వం రైతు ప్రభుత్వం అని రైతులు క్షేమంగా ఉంటేనే దేశం సుభిక్షంగా ఉంటుందని కూటమి నాయకులు పేర్కొనడం జరిగింది. ఈ కార్యక్రమంలో రైతులు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## రైతన్న మీ కోసం కార్యక్రమం విజయవంతం



జమ్మలమడుగు, మార్చి 23, ప్రభాతవార్త:

పెద్దముడియం మండలంలోని పెద్దపసుపుల గ్రామంలో సోమవారం రైతన్న మీ కోసం కార్యక్రమం విజయవంతంగా జరిగింది. ఈ కార్యక్రమానికి ప్రభుత్వ విప్ చదిపిరాళ్ల ఆదినారాయణరెడ్డి, కడప జిల్లా టీడీపీ అధ్యక్షుడు సి.భూపేష్ సుబ్బరామిరెడ్డిలు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డు చైర్మన్ నాగేశ్వర్‌రెడ్డి, వైస్ చైర్మన్ మల్లికార్జునరావు,జిల్లా వ్యవసాయ సంచాలకులు సుబ్రమణ్యేశ్వరరావు, ప్రొద్దుటూరు సహాయ వ్యవసాయ సంచాలకులు ఎల్.అనిత, ఏపీసీఎన్ఎఫ్ డీపీఎం ప్రవీన్ పాల్గొన్నారు.

## డిమాండ్ల సాధనకు యుటిఎఫ్ రిలే దీక్షలు ప్రారంభం

బద్వేలు అర్బన్, మార్చి 23, ప్రభాతవార్త

రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులు, ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యుటిఎఫ్) రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మార్చి 24న తాలూకా కేంద్రాలలో ఒక్కరోజు రిలే దీక్షలు నిర్వహించనున్నట్లు యుటిఎఫ్ జిల్లా అధ్యక్షుడు మాదన విజయకుమార్ తెలిపారు. పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద మంగళవారం ఉదయం 9.30 గంటలకు ఈ రిలే దీక్షలను ప్రారంభించనున్నట్లు పేర్కొన్నారు. ఈ దీక్షల ద్వారా 12వ పీఆర్సీ అమలు, ఆర్థిక బకాయిల చెల్లింపు, పెండింగ్ డీఏల విడుదల, సీపీఎస్ విధానం రద్దు చేసి పాత పెన్షన్ విధానం పునరుద్ధరణ, కారుణ్య నియామకాలు చేపట్టడం వంటి ప్రధాన డిమాండ్లను ప్రభుత్వం ముందుంచనున్నట్లు తెలిపారు.

## మూగజీవాల సంరక్షణలో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలి



బద్వేలు అర్బన్, మార్చి 23, ప్రభాతవార్త

వేసవికాలంలో దాహంతో ఇబ్బందులు పడుతున్న అడవి జంతువులను ఆదుకునే ఉద్దేశంతో అట్లూరు-సిద్దవటం ప్రధాన రహదారి సమీపంలోని అటవీ ప్రాంతంలో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఉమ్మడి కడప జిల్లా డీసీసీ బ్యాంక్ చైర్మన్ మంచూరు సూర్యనారాయణ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. పాలకొండ రాజశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో భాగంగా అటవీ ప్రాంతంలో 25కు పైగా నీటి తొట్టెలను ఏర్పాటు చేసి, ట్యాంకర్ ద్వారా నీటిని నింపించారు. వేసవిలో అడవుల్లో నీటి కొరత కారణంగా వన్యప్రాణులు ఇబ్బందులు పడకుండా, అలాగే జనావాసాల్లోకి రాకుండా ఉండేందుకు ఈ చర్యలు చేపట్టినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా మంచూరు సూర్యనారాయణ రెడ్డి మాట్లాడుతూ, వన్యప్రాణుల సంరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు పోతిరెడ్డి రెడ్డయ్య, అరవ శ్రీనివాసులురెడ్డి, ఓబులరెడ్డి రమణరెడ్డి, గురుప్రసాద్ రెడ్డి తదితరులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

## రైతు సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయం

సింగల్ విండో చైర్మన్ గుత్తికొండ త్యాగరాజు



ములకలచెరువు, మార్చి 23 ప్రభాతవార్త

రైతు సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని సింగల్ విండో చైర్మన్ గుత్తికొండ త్యాగరాజు అన్నారు. సోమవారం ములకలచెరువు మండలం వేపూరుకోట పంచాయతీలో రైతన్న సేవలో – మన మంచి ప్రభుత్వం" కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయ పరికరాలను అందజేస్తూ, ప్రకృతి వ్యవసాయం వైపు రైతులు ముందుకెళ్లాలు అన్నారు. అలాగే అన్నదాత సుఖీభవ – పీఎం కిసాన్ పథకం కింద ప్రతి రైతుకు ఏటా ..20,000 ఆర్థిక సహాయం అందిస్తున్నామని పేర్కొన్నారు. రైతును ఆదుకుంటూ, వారి అభివృద్ధికి కట్టుబడి పనిచేస్తున్నది ఈ ప్రభుత్వం అని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సింగిల్ విండో చైర్మన్ గుత్తికొండ త్యాగరాజు, ఏవో స్రవంతి, సుబ్రమణ్యం, నాయకులు ఎర్రగుడి సురేష్, కెవి రమణ, నరసింహారెడ్డి, మూగి రవిచంద్ర, బీజేపీ జయరాంరెడ్డి, చాంద్ బాషా, శ్రీనివాసులు రెడ్డి, అశోక్, పిడుగు రెడ్డప్ప, భాస్కర్ రెడ్డి, రామకృష్ణంరాజు, శేషారెడ్డి, శంకర్ రెడ్డి, రమేష్, బాలాజీ, హైదర్ పుల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఆసుపత్రి వర్గాల నిర్వహణలో నిర్లక్ష్యం తగదు

డాక్టర్ కే.అనిల్ కుమార్



పీలేరు మార్చి 23 ప్రభాతవార్త:

ప్రభుత్వ ఏరియా ఆస్పత్రి వ్యర్థాల నిర్వహణలో నిర్లక్ష్యం తగదని రాష్ట్ర వైద్య విధాన పరిషత్ అదనపు డైరెక్టర్ డాక్టర్ కె. అనిల్ కుమార్ న్నారు. సోమవారం పీలేరు వంద పడకల ఏరియా ఆస్పత్రిని తనిఖీ బృందంతో కలసి తనిఖీ చేశారు. ఆస్పత్రిలోని అన్ని విభాగాల్లోని బయోమెడికల్ వ్యర్థాల నిర్వహణ క్షుణ్ణంగా పరిశీలించారు. ఆస్పత్రిలోని వ్యర్థాలు ఎక్కడపడితే వేయరాదన్నారు. ప్రత్యేక చోట నిల్వచేసి ప్రభుత్వం నిర్దేశించిన తరలించాలన్నారు. వ్యవర్థాల నిర్వహణలో అన్నమయ్య జిల్లాలో రాయచోటి, లక్కిరెడ్డిపల్లె, వాల్మీకిపురం, పీలేరు ఆస్పత్రులను పరిశీలిస్తున్నట్లు తెలిపారు. రాష్ట్ర స్థాయిలో అన్ని ప్రభుత్వ ఆస్పత్రులు వైద్య బృందాలు తనిఖీచేస్తున్నట్లు చెప్పారు. ఇందులో భాగంగా ఉత్తమ ఫలితాలు సాధించిన ఆస్పత్రులకు పారిశుద్ధ్య ఎంపికతోనే ప్రోత్సాహకాలు లభిస్తాయని తెలిపారు. ఆస్పత్రులకు కూడా రాష్ట్ర స్థాయిలో కాయకల్ప అవార్డులుతో సత్కరించనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో డీఎసీహెచ్ఎస్ డాక్టర్ లక్ష్మీప్రసాద్, జిల్లా క్వాలిటీ మేనేజర్లు ప్రభావతి, నాగరాణి, ఆస్పత్రి సూపరింటిండెంట్ డాక్టర్ చంద్రశేఖర్, డాక్టర్ నాగవేణి, డాక్టర్ చంద్రశేఖర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## మూళ్ళకంచెతో ఇంటి దారి మూసివేత

వాల్మీకిపురం 23మార్చి, ప్రభాతవార్త:

ఇంట్లోకి వెళ్లకుండా మూళ్లకంపలతో దారిని మూసివేసారని బాధితుడు ఫిర్యాదు చేసిన సంఘటన మండలంలోని చింతపర్తి పంచాయతీ కోటపల్లిలో చోటుచేసుకుంది. వివరాలు ఇలా ఉన్నాయి..కోటపల్లికి చెందిన రైతు ప్రభాకర్ ఇంటికి ఇదే ప్రాంతానికి చెందిన ఒక వ్యక్తి, దారి తన స్థలంలోనే ఉందని చెబుతూ ముళ్లకంచెను వేశాడని బాధితుడు ప్రభాకర్ నాలుగు రోజుల క్రితం స్థానిక ఎస్సై తిప్పేస్వామికి ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు గ్రామానికి వచ్చి విచారించి ముళ్ళకంపలను తొలగించేశారు. రెవెన్యూ అధికారుల సహాయంతో భూమి సర్వే చేయించుకోవాలని పోలీసులు సలహా ఇచ్చారు. మళ్లీ రెండు రోజుల తర్వాత ఇంట్లోకి వెళ్లకుండా ముళ్ళకంపలను వేశాడని, తన భార్య పిల్లలు ఇంట్లో నుంచి బయటకు వచ్చే పరిస్థితి లేదని బాధితుడు సోమవారం స్థానిక పోలీసులతో వాపోయారు. తన ఇంటికి దారి కల్పించాలని పోలీసులను వేడుకున్నాడు.

## వందశాతం పన్నులు వసూళ్ళు చేయాలి



చౌడేపల్లి, మార్చి 23 ప్రభాతవార్త

మండల వ్యాప్తంగా వం దశాతం ఇల్లు, నీటి పన్నులు వసూళ్ళు చేయాలని డిప్యూటీ ఎంపిడిఓ గఫూర్ అన్నారు. ఈమేరకు ఆయన మేజర్ పంచాయతీ చౌడేపల్లిలో ఇంటి పన్నులను వసూళ్ళు చేసారు. ప్రజలు సకాలంలో పన్నులు చెల్లించి పంచాయతీల అభివృద్ధికి సహకరించాలన్నారు. పిడిఓలు ప్రతి ఇంటికి వెళ్ళి మొండి బకాయిలను వసూలు చేయాలన్నారు. పన్నుల చెల్లింపులపై యజమానులకు అవగాహన కల్పించాలన్నారు. పిడిఓ మహేష్, కార్యదర్శి శివకుమార్, సిబ్బంది పాల్గొన్నారు.

## పట్టాభిరామాలయంలో వార్షిక సాలకట్ల బ్రహ్మోత్సవాలు



వాల్మీకిపురం, 23మార్చి, ప్రభాతవార్త :

తిరుమల తిరుపతి దేవస్థానం ఆధ్వర్యంలోని స్థానిక పట్టాభిరామాలయంలో శ్రీ పరాభవనామ సంవత్సర వార్షిక సాలకట్ల బ్రహ్మోత్సవాలలో భాగంగా సోమవారం రాత్రి అంకురార్పణతో స్వామివారి బ్రహ్మోత్సవాలు అంగరంగ వైభవంగా ప్రారంభమయ్యాయి. అందుకు మునుపు ఉదయం 5 గంటలకు సుప్రభాత సేవతో కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి.6 గంటలకు మూలవర్లకు అభిషేకం,7:00కు అలంకరణ తదుపరి తోమాల సేవ పంచాంగ శ్రవణం తదితర కార్యక్రమాలు నిర్వహించారు.ఆలయంలో రాత్రి 7 గంటలకు స్వస్తి పుణ్యాహవచనం, రక్షాబంధనం,సేనాధిపతి ఉత్సవం, కలశ స్థాపన తదితర కార్యక్రమాల అనంతరం తితిదే వేద పండితుల మంత్రాల మధ్య ఉత్సవాల ప్రారంభానికి సూచికంగా అంకురార్పణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఉత్సవాల సందర్భంగా ఆలయంలో ఏర్పాటు చేసిన రంగురంగుల విద్యుత్తు దీపాలంకరణ విదేశీ పుష్పాలంకరణ భక్తులను విశేషంగా ఆకట్టుకుంది.ఈ కార్యక్రమంలో అధికారులు భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## మోటారు సైకిల్‌లో విషసర్పం కలకలం



చౌడేపల్లి, మార్చి 23 ప్రభాతవార్త

నిత్యం రద్దీగా వుండే ప్రాంత మది...అక్కడున్న ఓ మోటారు సైకిల్‌లోకి విషసర్పం దూరి అందరినీ కలవర పరచింది పట్టణంలోని సంతగేటుకు కూతవేటు దూరంలో ఇక్కలూరి మోహన్‌కు చెందిన మోటారు సైకిల్‌ను నిలపాడు. కొంత సేపు అయిన తర్వాత వెళ్ళి స్టార్ట్ చేద్దామ నుకొన్న అతనికి లైటింగ్ డూమ్‌లో విషసర్పం కనిపించింది. వెంటనే పక్కకు దూకి గట్టిగా కేకలు పెట్టాడు. గుర్తించిన స్థానికులు విషసర్పాన్ని టూవీలర్ నుంచి చాకచక్యంగా పట్టుకొన్నారు. స్కూటరిస్టు గుర్తించక అలానే వెళ్ళుంటే ప్రాణనష్టం జరిగుండేదనీ, గుర్తించడం వల్ల మేలు జరిగిందని అందరూ అనుకొన్నారు. రద్దీగా వుండే ప్రాంతంలో విషసర్పం కలకలం సృష్టించడంతో అందరూ గుమికూడారు.

## కట్టు దిట్ట భద్రత మధ్య గణిత పరీక్ష

రామసముద్రం మార్చి 24 ప్రభాతవార్త

రామసముద్రం మండలంలోని జడ్పీ హైస్కూల్, ఏపీ మోడల్ స్కూల్, కస్తూరిభా గాంధీ పాఠశాలలో నిర్వహిస్తున్న 10వ తరగతి పబ్లిక్ పరీక్షలు గణిత పరీక్ష ప్రశాంతంగా ప్రారంభమైంది. విద్యార్థులు గంట ముందుగానే పరీక్షా కేంద్రాలకు విద్యార్థులు చేరుకున్నారు. కేంద్రాల వద్ద సిబ్బంది విద్యార్థులను క్షుణ్ణంగా తనిఖీ చేసి లోపలికి అనుమతించారు.పరీక్ష కేంద్రాలు వద్ద వైద్యశిబిరం, హెచ్ ఎం చిట్టిబాబు, మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ మునిస్వామి నాయక్, కస్తూరిభా గాంధీ ప్రిన్సిపాల్ మస్తాన్‌బీలు విద్యార్థులకు, పరీక్షలు నిర్వహిస్తున్న ఇన్విజిలెటర్లకు సౌకర్యాలు కల్పించారు.


**ENDOWMENTS DEPARTMENT**

**SRI RAMA SWAMY TEMPLE**

**Madhavaram(V), Rayachoti(M), Annamayya District**

**e-Procurement Tender**

NIT.No. P/COE/134/2026 Dt:24-01-2026

e-Tenders are invited through the e-Procurement portal for Reconstruction of Temple. Interested bidders may visit the official website www.apeprocurement.gov.in for detailed information, eligibility criteria, and submission guidelines.

*Truestee*

**BEFORE THE HON'BLE DEPUTY REGISTRAR OF CHITS / ARBITRATIOR MEDCHAL- MALKAJGIRI DIST AT: MEDCHAL.**
**ABR.CF NO : 142 OF 2025**

Between :
M/s. KAPIL CHITS (HYD) PVT. LTD. KSET03J-43, SUCHITRA X ROAD-2 CAO Branch ...DISPUTANT
AND
Mr. KANAKA RAMAKRISHNA & OTHERS ...OPPONENTS
To,
1. Mr. Kanaka Ramakrishna, S/O. Gopal, Aged About : 36 Years, Occ.Police Constable, Emp Id No. 2869, Police Department, Government Of A P, Cuddapah, Andhra Pradesh. R/O:D No 1/57, Siddanakichayapalli, Porumamilla, Kadapa, Y.S.R. (CUDDAPAH), Andhra Pradesh, India - 516505.
2. Mr. Chelamcherla Sreenivasulu, S/O. Venkataiah, Aged About :36 Years, Occ: Police Constable, Emp Id. No 2878 Police Department, Government Of A P, Cuddapah, Andhra Pradesh. R/O: B, Kottapalli, Mydukur, Mydukur, Y.S.R. (CUDDAPAH), Andhra Pradesh, India - 516172.
3. Mr. Madha Sreenivasulu, S/O. Rangaraiah, Aged About :37 Years, Occ: Police Constable Id No. 2861 Police Department Government Of A P Cuddapah, Andhra Pradesh. R/O: D.No. 9, Paluguralla palle, B Mattam, Y.S.R. (CUDDAPAH), Andhra Pradesh, India - 516503.
4. Mr. Koduru Veera Mohan, S/O. Brahmaiah, Aged About :36 Years, Occ: Police Constable Id No. 2514 Police Department Government Of A P Cuddapah, Andhra Pradesh .R/O: D.No. 23A, Ayyavaripalli, Munnelli, Y.S.R. (CUDDAPAH), Andhra Pradesh, India - 516193.
Whereas the above named Plaintiff has instituted a suit against you for recovery of money of **Rs. 1,45,739/-**. You are hereby summoned to appear in the above court in person or by an advocate duly instructed on the **07-04-2026 at 1:00 PM** failing which the matter will be decided exparte in accordance with law.
//BY ORDER OF THE APPELLATE AUTHORITY//
**J. SRINIVAS REDDY, ADVOCATE,** Hyderabad.

**BEFORE THE HON'BLE DEPUTY REGISTRAR OF CHITS / ARBITRATIOR MEDCHAL- MALKAJGIRI DIST AT: MEDCHAL.**
**ABR.CF NO : 148 OF 2025**

Between :
M/s. KAPIL CHITS (HYD) PVT. LTD. KSEKAT12J-47, SUCHITRA X ROAD-2 CAO Branch. ...DISPUTANT
AND
Mr. KANAKA RAMAKRISHNA & OTHERS ...OPPONENTS
To,
1. Mr. Kanaka Ramakrishna, S/O. Gopal, Aged About : 36 Years, Occ: Police Constable, Emp Id No. 2869, Police Department, Government Of A P, Cuddapah, Andhra Pradesh. R/O:D No 1/57, Siddanakichayapalli, Porumamilla, Kadapa, Y.S.R. (CUDDAPAH), Andhra Pradesh, India - 516505.
2. Mr. Vutukuru Sudhakar, S/O. Subbarayulu, Aged About :43 Years, Occ: Police Constable, Emp Id No. 773, Police Department, Government Of A P, Cuddapah, Andhra Pradesh, R/O: H.No. 10-96, Balijakota Street, Akkalreddu palle, Y.S.R. (CUDDAPAH), Andhra Pradesh, India - 516193.
3. Mr. Chelamcherla Sreenivasulu, S/O. Venkataiah, Aged About :36 Years, Occ: Police Constable, Emp Id. No 2878 Police Department, Government Of A P, Cuddapah, Andhra Pradesh, R/O: B, Kottapalli, Mydukur, Mydukur, Y.S.R. (CUDDAPAH), Andhra Pradesh, India - 516172.
4. Mr. Kommuri Srinivasulu, S/O. K Narasimhulu, Aged About :37 Years, Occ: Police Constable, Emp Id No. 2889, Police Department, Government Of A P, Cuddapah, R/O: 10/56, Reddyvari Pali, Govindayapali, Munnelli, Munneli B, Kodur, Kadapa, Reddyvari, Kodur, Y.S.R. (CUDDAPAH), Andhra Pradesh, India - 516193.
Whereas the above named Plaintiff has instituted a suit against you for recovery of money of **Rs. 2,11,992/-**. You are hereby summoned to appear in the above court in person or by an advocate duly instructed on the **07-04-2026 at 1:00 PM** failing which the matter will be decided exparte in accordance with law.
//BY ORDER OF THE APPELLATE AUTHORITY//
**J. SRINIVAS REDDY, ADVOCATE,** Hyderabad

**BEFORE THE HON'BLE DEPUTY REGISTRAR OF CHITS / ARBITRATIOR MEDCHAL- MALKAJGIRI DIST AT: MEDCHAL.**
**ABR.CF NO : 305 OF 2025**

Between :
M/s. KAPIL CHITS (HYD) PVT. LTD. KSEKAL05P-36, SUCHITRA X ROAD-2 CAO Branch. ...DISPUTANT
AND
Mrs. Parimala E B & OTHERS ...OPPONENTS
To,
1. Mrs. Parimala E B, D/O. Ega Bojji Reddi Gari Deva Narayana Reddy, Aged About : 35 Years,Occ: Reporting Manager Emp No. 1351113 Cisco Systems (INDIA) Pvt Ltdhyderabad R/O: D.No. 42/243-3-1 Bhagyanagar Colony, Y.S.R. (CUDDAPAH), Andhra Pradesh, India.
2. Mrs. Seshugandla Rajamma, D/O. Chinna Subbanna, Aged About :38 Years, Occ: Record Assistant Emp Id No 12010480 Govt Of Andhra Pradesh Govt College For Men Kadapa R/O: H.No. 4/39 , Sc Colony , Devarajupalli , Kamalapuram Y.S.R. (CUDDAPAH), Andhra Pradesh, India.
3. Mrs. Shaik Ameerunnisa, S/O. Ershad Ahmmad, Aged About :45 Years, Occ. Typist Emp Id No. 14330573 Govt Of Andhra Pradesh – A P S H P Division Rajampeta Kadapa Road & Building Dept A P . R/O: H.No. 11/108 , Ganeshpuram , Vallur Y.S.R. (CUDDAPAH), Andhra Pradesh, India.
4. Mr. Khader Basha Shaik, S/O. Dada Saheb, Aged About :52 Years,Occ: Typist Emp Idno. 14330573 Govt Of Andhra Pradesh A P S H P Division Quality Control Sectionroad & Building Dept Kadapa AP. R/O: D.No. 30/108-4, Afzalkhan Street, Y.S.R. (CUDDAPAH), Andhra Pradesh, India.
5. Mr. Raja Boga, S/O. B Rangaswami, Aged About :26 Years,Occ: Test Engineer Emp Id No. Tss - 047 Triant Software Solutions Pvt Ltd - Manjeera Majestic Commercial Jntu Rd Kphb Hyderabad R/O: D.No. 38-168 , Bajaj Showroom, Y.S.R. (CUDDAPAH), Andhra Pradesh, India.
6. Mrs. Nandyala Avanija, D/O. Viswanatha Sharma, Aged About :34 Years,Occ: Swengineer Emp Id No. Tss - 059 Triant Software Solutions Pvt Ltd- Manjeera Majestic Commercial Jntu Rd Kphb Hyderabad R/O: H.No. 42/243-3-1, Bhagyanagar Colony, Y.S.R. (CUDDAPAH), Andhra Pradesh, India.
7. Mrs.Egaboiji Reddy Gari Narayanamma, S/O. Devanarayana Reddy, Aged About :54 Years,Occ: Ps Mother R/O: H.No. 42/243-3-1, Bhagyanagar Colony, Y.S.R. (CUDDAPAH), Andhra Pradesh, India.
Whereas the above named Plaintiff has instituted a suit against you for recovery of money of **Rs. 4,10,582/-**. You are hereby summoned to appear in the above court in person or by an advocate duly instructed on the **07-04-2026 at 1:00 PM** failing which the matter will be decided exparte in accordance with law.
//BY ORDER OF THE APPELLATE AUTHORITY//
**J. SRINIVAS REDDY, ADVOCATE,** Hyderabad.

## వాహనాలు తనిఖీ చేసిన ఎస్పై



**సిద్ధవటం, మార్చి 23 ప్రభాతవార్త:**
బద్వేల్, కడప ప్రధాన రహదారి ఫారెస్ట్ తనిఖీ కేంద్రం వద్ద సోమవారం సాయంత్రం ఎస్పై హారిక విస్తృతంగా వాహనాలు తనిఖీ చేపట్టారు మండల కేంద్రమైన సిద్ధవటం గ్రామ శివారులోని ఫారెస్ట్ తనిఖీ కేంద్రం వద్ద మండల ఎస్పై హారిక వాహనాల తనిఖీ చేపట్టారు ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులకు హెల్మెట్ లైసెన్స్ తప్పనిసరిగా ఉండాలని తెలిపారు సరైన పత్రాలు లేని 10 ద్విచక్ర వాహనదారులకు ఒక్కో వాహనానికి 185, చొప్పున అపరాధ రుసుము విధించామని ఎస్పై హారిక తెలిపారు ఈ కార్యక్రమంలో ఏఎస్ఐ సుబ్బరామచంద్ర పోలీసులు సిబ్బంది పాల్గొన్నారు.

## రేపు ప్రొద్దుటూరు మండల పరిషత్ సమావేశం

**ప్రొద్దుటూరు రూరల్ మార్చి 23 ప్రభాతవార్త:**
25వ తేదీ బుధవారం నాడు ప్రొద్దుటూరు మండల ప్రజా పరిషత్ సర్వ సభ్య సాధారణ సమావేశాన్ని ఉదయం 10:30 కు నిర్వహిస్తున్నట్లు ప్రొద్దుటూరు ఎంపీడీవో సూర్యనారాయణ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశానికి సంబంధిత అధికారులు అందరూ తమ శాఖకు సంబంధించిన ప్రగతి నివేదికలను పూర్తి సమాచారంతో హాజరు కావలసిందిగా ఆయన కోరారు ఈ సమావేశంలో 15 అంశాలపై చర్చించేందుకునేందుకు అజెండాలో చేర్చడమైందన్నారు.

## ఉపాధి పనులను పరిశీలించిన ఏపీవో




**ముద్దనూరు, మార్చి 23 ప్రభాతవార్త:**
రాష్ట్ర కేంద్ర ప్రభుత్వాలు ఉపాధి హామీ పనులలో మార్పు చేర్పులపై కూలీలకు సోమవారం నాడు చిన్న దుద్యాల, గ్రామంలో పూడికతీత పనులు చేపడుతున్న కూలీలకు అవగాహన కల్పించినట్లు ఉపాధి ఏపీవో గంగయ్య తెలిపారు. కూలీలు తప్పనిసరిగా ముఖ ఆధారిత హాజరు, ఈ కేవైసీ పై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. అనంతరం కూలీల మస్టర్లను పరిశీలించి, ఎటువంటి అవకలకు పాల్పడిన కఠిన చర్యలు ఉంటాయని సిబ్బందికి సూచించారు. ఈ కార్యక్రమంలో ఉపాధి సిబ్బంది ఉపాధ్యాయిని కూలీలు పాల్గొన్నారు.

## బుధవారం మండల సర్వసభ్య సమావేశం

**ముద్దనూరు, మార్చి 23 ప్రభాతవార్త:**
గ్రామ పంచాయతీల సమస్యల పరిష్కారానికి అధికారులు నిర్వహించే సాధారణ మండల సర్వసభ్య సమావేశం అధికారుల ఆదేశాల మేరకు బుధవారం నాడు మండల అధ్యక్షులు, మండల అభివృద్ధి అధికారి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో రాధాకృష్ణ వేణి సోమవారం ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి సర్పంచులు, మండల అధికారులు వారి శాఖ పరిధిలోని ప్రగతి నివేదికలతో హాజరుకావాలని సూచించారు.

## రైతన్న మీకోసం కార్యక్రమం



**ముద్దనూరు,మార్చి 23 ప్రభాతవార్త:**
వ్యవసాయ రంగంలో అధికారుల సూచనల మేరకు పంచ సూత్రాలు పాటిస్తే వ్యవసాయని లాభసాటిగా మార్చుకోవచ్చునని మండల ఏడిఏ రామ్మోహన్ రెడ్డి ఏవో వెంకటకృష్ణారెడ్డి సోమవారం ప్రభుత్వం చేపట్టిన రైతన్న మీ కోసం కార్యక్రమంలో భాగంగా ఉప్పలూరు, కొలవలి, వేల్పుచర్ల, గ్రామలలో నిర్వహించి రైతులకు పలు సూచనలు సలహాలు చేశారు. ప్రతి రైతు ఏపీఎఫ్ ఆర్ పోర్టల్‌లో రైతులు రిజిస్ట్రేషన్,ఏపీ ఎయిమ్స్ యాప్‌ను డౌన్లోడ్ చేసుకోవాలి అన్నారు. గ్రామంలో రైతన్న మీ కోసం కార్యక్రమంలో భాగంగా పంచ సూత్రాలు అయిన నీటి భద్రత,డిమాండు ఆధారిత పంటలు,ఫుడ్ ప్రాసెసింగ్,అగ్రిటెక్,వ్యవసాయ రంగంలో ప్రభుత్వం మద్దతు మొదలగు అంశాల గురించి వివరించారు. ప్రతి రైతు వ్యవసాయ శాఖ ద్వారా అమలు చేసే ప్రతి పథకం గురించి అవగాహన పొంది లబ్ది పొందాలి అన్నారు. అనంతరం ఆయా గ్రామాల్లో రైతులతో కలసి రైతన్న మీకోసం కరపత్రాలను మరియు యూరియా వాడకం నకు సంబంధించిన గోడ పత్రాలను ఆవిష్కరించారు. ఈ రైతు సేవా కేంద్ర సిబ్బంది ప్రశాంత్ కుమార్, లక్ష్మీ సింధూర చంద్రిక, రైతులు పంగా వేణుగోపాల్ యాదవ్, చంద్రశేఖర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## గేట్ 2026 పరీక్షలో అర్హత సాధించిన అర్చన

**ప్రొద్దుటూరు మార్చి 23 ప్రభాతవార్త**



మండల పరిధిలోని గౌతమి మహిళా ఇంజనీరింగ్ కళాశాల అటానమస్‌లో ఇంజనీరింగ్ చివరి సంవత్సరం చదువుతున్న సిఎస్సి విభాగానికి చెందిన ఏ అర్చన దేశవ్యాప్తంగా ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించబడే గేట్ పరీక్షలలో విశేష ప్రతిభ కనబరిచి అర్హత సాధించినట్లు కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎంరా మసుబ్బమ్మ తెలిపారు దేశంలోని ప్రముఖ ఐఐటి కళాశాలలో సీట్లు భర్తీ చేయడం కోసం ప్రతి సంవత్సరం గేట్ పరీక్షలను నిర్వహిస్తారన్నారు గేట్ 2026 పరీక్షలు అర్చన 244 చేసి అర్హత సాధించడం తోపాటు ఇతర విద్యార్థులకు ప్రేరణగా నిలిచిందని కళాశాల కో డైరెక్టర్ శైలుషా తెలిపారు కళాశాల డైరెక్టర్లు నాగూరు రవీంద్రారెడ్డి కరస్పాండెంట్ బాబమ్మ మాట్లాడుతూ గేట్ వడ్డీ పోటీ పరీక్షలు విద్యార్థులకు ఉన్నత విద్యను మంచి ఉద్యోగ అవకాశాలకు మార్గము సుగమం చేస్తాయని తెలిపారు డిప్లమా కళాశాల ప్రిన్సిపల్ ప్రకాష్ రావు వివిధ విభాగ అధిపతులు ఆలీ సుకుమార్ జాబీర్ డాక్టర్ లావణ్య అధ్యాపక, అధ్యాపకేత్ర బృందం విద్యార్థినిని అభినందించారు.

## మదనపల్లెలో వ్యక్తి అనుమానాస్పద మృతి

**మదనపల్లెక్రైమ్, మార్చి 23 ప్రభాతవార్త.**
మదనపల్లె పట్టణంలోని బాంబో వీధికి చెందిన ఓ వ్యక్తి తన ఇంట్లోనే అనుమానాస్పద స్థితిలో మృతి చెందాడు. పోలీసుల కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణం లోని బాంబో వీధికి చెందిన అన్సర్ (65) స్థానిక వారపు సంతలోని ఖాజా కూరగాయల మార్కెట్‌లో రైటర్‌గా పనిచేస్తూ జీవనం సాగిస్తున్నాడు. ఇతని భార్య సాజిదా నాలుగేళ్ల క్రితమే అనారోగ్యంతో మరణించింది. అప్పటి నుండి అన్సర్ తన ఇద్దరు కుమారులతో కలిసి నివసిస్తున్నాడు. సోమవారం మధ్యాహ్నం అన్సర్ తన ఇంట్లో మృతి చెందాడు. మృతుడి తలపై గాయం ఉండటంతో, ఎవరో గుర్తు తెలియని వ్యక్తులు చంపి ఉంటారని కుటుంబ సభ్యులు అనుమానం వ్యక్తం చేశారు. దీనిపై మృతుడి బంధువు పీరా మదనపల్లె రెండో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన ఎస్పై నాగేశ్వరరావు, సంఘటనా స్థలాన్ని పరిశీలించి దర్యాప్తు ప్రారంభించారు. అనంతరం మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మదనపల్లె జిల్లా ఆసుపత్రి మార్చురీకి తరలించారు.

# ఘనంగా భగత్ సింగ్, రాజగురు, సుఖదేవ్ వర్ధంతి

**బద్వేలు, మార్చి 23, ప్రభాతవార్త**
పట్టణంలో మహనీయుల ఆశయాల సాధన సమితి మరియు వివిధ ప్రజాసంఘాల ఆధ్వర్యంలో అమర వీరులు భగత్ సింగ్, రాజగురు, సుఖదేవ్‌ల 85వ వర్ధంతి కార్యక్రమం సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భగత్ సింగ్ విగ్రహానికి పూలమాలలు వేసి ముగ్గురు మహనీయుల త్యాగాలను స్మరించుకుంటూ జోహార్లు అర్పించారు. మహనీయుల ఆశయాల సాధన సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు గురుమూర్తి మాట్లాడుతూ, భగత్ సింగ్ చిన్ననాటి నుంచే బ్రిటీష్ పాలనపై వ్యతిరేక భావనలు కలిగి స్వాతంత్ర్య ఉద్యమంలో పాల్గొన్నారని తెలిపారు. శాంతియుత మార్గాలతో బ్రిటీష్ పాలనను ముగించలేమని భావించి విప్లవ మార్గాన్ని ఎంచుకుని ప్రజల్లో చైతన్యం నింపారని చెప్పారు. "విప్లవం వర్ధిల్లాలి" అనే నినాదాన్ని దేశానికి అందించిన మహానుభావుడు భగత్ సింగ్ అని పేర్కొన్నారు. లాలా లజపత్ రాయ్ మరణానికి ప్రతీకారంగా రాజగురు, సుఖదేవ్‌లతో కలిసి బ్రిటీష్ అధికారులపై దాడి చేసిన ఘటనను ఆయన గుర్తు చేశారు. అనంతరం బ్రిటీష్ ప్రభుత్వం ముగ్గురినీ అరెస్ట్ చేసి 1931 మార్చి 23న ఉరి తీశారని తెలిపారు. వారి త్యాగాలను ఎప్పటికీ మరువకూడదని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆవాజ్ కమిటీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు షేక్ అన్వర్ బాష, జాతీయ బీసీ సంక్షేమ సంఘం నాయకులు మస్తానయ్య, బాలయ్య, చేతివృత్తిదారుల సంఘం పట్టణ కార్యదర్శి జి. నాగార్జున, కులవివక్ష వ్యతిరేక పోరాట సమితి నాయకుడు జకరయ్య, పూలే ఆశయ సాధన సమితి నాయకుడు రాజగోపాల్ పాల్గొన్నారు.



## తహసిల్దార్‌గా శివలక్ష్మి బాధ్యతలు

**నందలూరు, మార్చి 23 ప్రభాతవార్త:**



మండల తహసిల్దార్‌గా శివలక్ష్మి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. వేంపల్లిలో డిప్యూటీ తహసిల్దారుగా పనిచేస్తూ పదోన్నతిపై ఇక్కడికి బదిలీ అయ్యారు. అనంతరం ఆమె మాట్లాడుతూ ప్రజలకు ఏవైనా సమస్యలు ఉన్నా తనను నేరుగా సంప్రదించాలని సూచించారు. సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తానని తెలిపారు. కార్యక్రమంలో ఆర్ఐ సుశీల్ కుమార్, అసిస్టెంట్ శివ తదితరులు పాల్గొన్నారు.

## వివిధ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల ఆడిట్

### డిప్యూటీ డి.ఎం.హెచ్.ఓ డాక్టర్ వి. మల్లేష్,



**మైదుకూరు, మార్చి 23, ప్రభాతవార్త:**
డివిజన్ డిప్యూటీ డి.ఎం. హెచ్.ఓ డాక్టర్ వి. మల్లేష్ ఆధ్వర్యంలో మైదుకూరులోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్ (సిహెచ్‌సి)లో బద్వేలు డివిజన్ పరిధిలోని వివిధ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో (పిహెచ్‌సిఎస్, యుపిహెచ్‌సిఎస్) ఫిబ్రవరి నెలలో జరిగిన అబార్షన్లపై ఆడిట్ నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ మల్లేష్ మాట్లాడుతూ, గర్భస్రావాల విషయంలో సరైన నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని సూచించారు. ముఖ్యంగా, రికార్డుల నిర్వహణ మరియు అబార్షన్ల ప్రక్రియలో సిబ్బంది తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆయన పలు కీలక సూచనలు చేశారు. ఈ ఆడిట్ కార్యక్రమంలో గైనకాలజిస్ట్ డాక్టర్ వి. సుధా, సూపర్వైజర్లు కె. వీరాంజనేయులు, మరియు సూపర్వైజర్లులు మరియు ఆరోగ్యం కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఘనంగా దొమ్మేటి వెంకటరెడ్డి జయంతి


నివాళులర్పిస్తున్న దృశ్యం

**మదనపల్లె, మార్చి 23 ప్రభాతవార్త :**
సామాజిక న్యాయం కోసం జీవితాంతం పోరాడిన దొమ్మేటి వెంకటరెడ్డి మహనీయుడని ఆయన ఆశయాలను ప్రతి ఒక్కరూ స్ఫూర్తిగా తీసుకొని ముందుకు సాగాలని జిల్లా కలెక్టర్ నిశాంత్‌కుమార్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లోని పిజిఆర్ఎస్ హాలులో వెనుకబడిన తరగతులు సంక్షేమశాఖ ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన దొమ్మేటి వెంకటరెడ్డి జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వెంకటరెడ్డి సమాజసేవకు అంకితభావంత పనిచేసిన మహనీయుడని కొనియదారు. ఆయన జీవితం ప్రజలకు ఆదర్శంగా నిలిచిందన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ శివనారాయణశర్మ, సబ్‌కలెక్టర్ చల్లా కళ్యాణి, కేఆర్‌ఆర్‌సి డిప్యూటి కలెక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి, సర్వే ఏడి భరత్‌కుమార్‌రెడ్డి, సంక్షేమ ఇన్‌చార్జ్ అధికారి తేజశ్వని, జిల్లా అధికారులు, శెట్టిబలజ ప్రతినిధులు పాల్గొన్నారు.

## బిసిలను పట్టించుకోని కూటమి ప్రభుత్వం

### బిసివై నాయకులు రమేష్‌యాదవ్, సాంబమూర్తి


నిరసన తెలుపుతున్న దృశ్యం

**మదనపల్లె, మార్చి 23 ప్రభాతవార్త :**
బిసిల సమస్యలను కూటమి ప్రభుత్వం పట్టించుకోలేదని భారత చైతన్య యువజన పార్టీ(బిసివై) నాయకులు నిరసనలు వ్యక్తం చేశారు. సోమవారం మదనపల్లె కలెక్టరేట్ వద్ద నిరసన కార్యక్రమాలు చేపట్టి అనంతరం కలెక్టర్ నిశాంత్‌కుమార్‌కు సమస్యలపై వినతిపత్రం అందచేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బిసిల రక్షణ చట్టం వెంటనే అమలు చేయాలని, అమరావతి రాజధాని ప్రాంతంలో బిసిలకు వెయ్యి ఎకరాల స్థలాన్ని కేటాయించాలని, రాష్ట్రంలో సమగ్ర కులగణన చేపట్టాలని, విద్యా, ఉద్యోగ, స్థానిక సంస్థల ఎన్నికల్లో బిసిలకు 44శాతం రిజర్వేషన్ కల్పించాలని, బిసి కార్పోరేషన్‌లకు వెంటనే నిధులు విడుదల చేయాలన్నారు. ఈ ఐదు డిమాండ్లను పరిష్కరించకపోతే ఏప్రిల్ 11నుంచి రాష్ట్ర అధ్యక్షులు బోడె రామచంద్రయాదవ్ ఆధ్వర్యంలో శాంతియుత పద్దతిలో ఆమరణ నిరాహారదీక్ష చేపడుతామన్నారు. స్వాతంత్ర్యం వచ్చి 75ఏళ్ళు అయినా బిసిల సమస్యలు పరిష్కారం చేయలేకపోతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు హరిబాబుయాదవ్, ఉత్తన్న, గిరిబాబు, స్వాతి, వెంకటేష్ యాదవ్, నటరాజు తదితరులు పాల్గొన్నారు.

## మునిసిపాలిటీ ప్రత్యేక అధికారిగా ఏ.మురళి

**మైదుకూరు, మార్చి 23, ప్రభాతవార్త:**
మునిసిపాలిటీ ప్రత్యేక అధికారిగా కడప రెవిన్యూ డివిజనల్ అధికారిగా ఏ. మురళి సోమవారం ఉదయం పదవీ బాధ్యతలు స్వీకరించారు. తదనంతరం మునిసిపల్ కార్యాలయ శాఖధిపతులతో త్రాగునీరు, పారిశుద్ధ్యం, పట్టణ ప్రణాళిక విభాగంలో అనధికార కట్టడాలు బి పి ఎస్ మరియు ఎల్ ఆర్ ఎస్, ఆస్తి పన్ను బకాయిల వసూలు తదితర అంశాలపై సమీక్ష నిర్వహించారు. మైదుకూరు పురపాలక అభివృద్ధిలో అందరినీ కలుపుకొని అమలులో ఉన్న ప్రభుత్వ నియమ నిబంధనలకు మేరకు పని చేస్తామని తెలిపారు. స్పెషల్ ఆఫీసర్ గా నూతన బాధ్యతలు చేపట్టిన కడప రెవిన్యూ డివిజనల్ అధికారి ఏ. మురళి వారికి కమీషనర్ రంగస్వామి,ఏఈ నిరంజన్ రెడ్డి శాలువాతో సత్కరించి పూల బొకేను అందజేశారు. ఈ కార్యక్రమంలో మైదుకూరు పురపాలక సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజాసమస్యల పరిష్కారమే ధ్యేయం : ఎమ్మెల్యే


అర్జీలు స్వీకరిస్తున్న ఎమ్మెల్యే

**మదనపల్లె, మార్చి 23 ప్రభాతవార్త :**
ప్రజాసమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేయాలంటూ ఎమ్మెల్యే షాజహాన్‌బాషా తెలిపారు. సోమవారం ఎమ్మెల్యే నివాసం వద్ద జరిగిన ప్రజాదర్బార్ కార్యక్రమంలో నియోజకవర్గంలో వివిధ ప్రాంతాలకు చెందిన ప్రజలు వివిధ సమస్యలపై ఎమ్మెల్యేకు విన్నవించారు. ప్రజలు విన్నవించిన అర్జీలను ఎమ్మెల్యే స్వీకరించి వాటిపరిష్కారానికి సంబంధిత అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రజలు విన్నవించే సమస్యలను సమస్యను బట్టి గడువులోపు పరిష్కరించడం జరుగుతుందన్నారు. ప్రధానంగా రోడ్లు, నీటి సౌకర్యం, మురుగునీటి కాలువుల పరిష్కారానికి చర్యలు తీసుకొంటామన్నారు. అనంతరం ఎమ్మెల్యే ఇందిరానగర్‌లోని ఇంటర్ విద్యార్థిని, విద్యార్థులకు అంబీషన్ అకాడమి నీట్ శిక్షణా కోచింగ్ సెంటర్ ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు పాల్గొన్నారు.

## ఆర్ఓ ప్లాంటులపై అధికారుల పర్యవేక్షణ కరువు

**మదనపల్లె, మార్చి 23 ప్రభాతవార్త :**
పట్టణంలో ఉన్న ఆర్ఓ ప్లాంటులపై అధికారులు పర్యవేక్షణ పూర్తిగా కొరవడిందని బహుజన యువసేన అధ్యక్షులు పునిత్ కుమార్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్‌లో జరిగిన పిజిఆర్ఎస్‌లో ఆయన కలెక్టర్‌కు విన్నవించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణ ప్రజల ఆరోగ్యంతో ముడిపడి ఉన్న ఆర్ఓ వాటర్ ప్లాంట్‌ల నిర్వహణలో అపరశుభ్రత ఉంటుందని దీని వల్ల ప్రజలు అనారోగ్యాలకు గురవుతున్నారన్నారు. అధికారులు స్పందించి ఆర్ఓ ప్లాంట్లును తనిఖీ చేసి శుద్ధి చేసిన నీటిని ప్రజలకు అందించాలని డిమాండ్ చేశారు. అంతేకాకుండా అనధికారికంగా నిర్వహిస్తున్న ఆర్ఓప్లాంటులపై చర్యలు తీసుకోవాలన్నారు.

## ద్విచక్ర వాహనాన్ని కారు ఢీకొట్టిన ఘటనపై కేసు నమోదు

**ముద్దనూరు, మార్చి 23 ప్రభాతవార్త:**
మండల పరిధిలోని కొత్తపల్లె గ్రామ సమీపంలో జాతీయ రహదారిపై ఈ నెల 14వ తేదీ బద్వేల్ మండలం నుంచి తొండూరు మండలం కంబాలపల్లె గ్రామంలో ఉండే కుటుంబ సభ్యుల ఇంటికి ద్విచక్ర వాహనంలో తండ్రి మద్దిలేటి, కొడుకు లక్ష్మీనరసింహ వెళుతుండగా ఎర్రగుంట్ల వైపు నుంచి వస్తున్న కారు అతివేగంగా వచ్చి ద్విచక్ర వాహనం వెనుక భాగాన్ని ఢీకొట్టడంతో ద్విచక్ర వాహనంలోని వ్యక్తులకు తీవ్ర గాయాలు అవడంతో స్థానికులు 108 వాహనానికి సమాచారం అందించి చికిత్స అనంతరం సోమవారం కొడుకు లక్ష్మీనరసింహ ఫిర్యాదు మేరకు ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ ఐ మధుసూదన్ రెడ్డి తెలిపారు.

## బాధ్యతలు చేపట్టిన తాసిల్దార్ హరినాథ్ రెడ్డి

**రాజుపాళెం, మార్చి 23, ప్రభాతవార్త:**
నూతన తాసిల్దారుగా వై.హరినాథ్ రెడ్డి సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా సమస్యలు, రైతుల భూ సమస్యల పరిష్కారమునకు కృషిచేస్తానన్నారు. ఈయన వేంపల్లి నుండి బదిలీపై ఇక్కడికి వచ్చారు. తొలుత వెల్లాల పుణ్యక్షేత్రంలోని శ్రీ సంజీవరాయ స్వామి దర్శించుకుని పూజలు నిర్వహించారు. నూతన బాధ్యతలు చేపట్టిన తాసిల్దార్ కు డిప్యూటీ తాసిల్దార్ మనోహర్ రెడ్డి ఆధ్వర్యంలో రెవెన్యూ కార్యాలయ అధికారులు స్వాగతం పలికారు.

## తెలుగుదేశం నాయకుడు మృతి నివాళులర్పించిన చమర్తి

**సుండుపల్లి, మార్చి 23,ప్రభాతవార్త**
మండల పరిధిలోని పెద్దినేని కాలువ రాచపల్లికు చెందిన తెదేపా నాయకులు భాస్కర్ రాజు కన్నుమూశారు. ఈ విషయం తెలుసుకున్న నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ చమర్తి జగన్మోహన్ రాజు సోమవారం భాస్కర్ రాజు భౌతికకాయానికి పూలమాల వేసి నివాళులర్పించారు.అనంతరం, మృతుని కుటుంబ సభ్యులను పరామర్శించి వారికి తన ప్రగాఢ సానుభూతిని తెలియజేసి భాస్కర్ రాజు మృతి పార్టీకి తీరని లోటని చమర్తి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో తెదేపా నా యకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



## పెండ్లిమర్రి తహసీల్దారుగా శోభన్‌బాబు

**పెండ్లిమర్రి, మార్చి 23, ప్రభాతవార్త:**
తహసీల్దారుగా కె.శోభన్‌బాబు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ఏదైనా రెవెన్యూ సమస్యలుంటే తన దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తానన్నారు. ప్రజలకు అందుబాటులో ఉండి వారికి ఏదైనా భూ సమస్యలుంటే పరిష్కరిస్తానన్నారు. సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. రీ సర్వే భూమి సమస్యలు పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సబ్బంది పాల్గొన్నారు.

## పేకాట స్థావరాలపై దాడి పదిమంది అరెస్ట్

**నిమ్మనపల్లి మార్చి 23 ప్రభాతవార్త**
మండలం ముష్టూరు గ్రామపంచాయతీలో సోమవారం పేకాట ఆడుతున్న స్థావరాలు పై పోలీసులు దాడి చేశారు. నిమ్మనపల్లి ఎస్పై కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని ముష్టూరు పంచాయతీలో పేకాట ఆడుతున్న స్థావరంపై పోలీసులు దాడులు నిర్వహించి పదిమంది పేకాటరాయలను అరెస్ట్ చేసి వారి వద్ద నుండి 8560 రూపాయలను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్పై తెలిపారు. అనంతరం ఏడు సెల్ ఫోన్ లను స్వాధీనపరచుకొని సీజ్ చేసినట్లు పేర్కొన్నారు. పేకాట రాయలపై కేసు నమోదు చేశారు.

## నూతన తాసిల్దార్ బాధ్యతలు స్వీకరణ..

**యర్రగుంట్ల మార్చి 23 ప్రభాతవార్త**
నూతన తహశీల్దార్ బి.అమరేశ్వరి సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈమె గతంలో నందలూరు తహశీల్దారుగా విధులు నిర్వహిస్తూ ఉన్నతాధికారుల బదిలీల్లో భాగంగా బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ పనిచేసిన శోభన్ బాబు పెండ్లిమర్రికి బదిలీ అయ్యారు.

## భూసార పరీక్షల ద్వారా ఎరువులు వినియోగించాలి

**దువ్వూరు, మార్చి 23, ప్రభాతవార్త:**



మండలంలోని రైతులు పొలాల్లోని మట్టి నమూనాలను తీసుకుని భూసార పరీక్షలు చేయించుకొని వాటిలో వచ్చిన ఫలితం ద్వారా రసాయనిక ఎరువులు వినియోగించాలని మండల వ్యవసాయ అధికారి అమర్‌నాథ్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధిలోని రైతన్న మీకోసం అనే కార్యక్రమాన్ని మీర్జఖాన్ పల్లె గ్రామంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన రైతులతో మాట్లాడుతూ పశ్చిమ ఆసియా యుద్ధం వల్ల రసాయనిక ఎరువుల ధరలు పెరిగే సూచనలు ఉన్నాయని, అలాగే ఎరువుల కొరత కూడా ఏర్పడే అవకాశం ఉందని అందువల్ల ప్రతి రైతు జాగ్రత్త వహించి భూసార పరీక్షలు చేయించుకోవాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం రైతుల కోసం అనేక కార్యక్రమాలు చేపడుతుందని అందులో భాగంగా రైతులకు ఆదాయం వచ్చేందుకు ఏ పంట సాగు చేస్తే మంచి డిమాండ్ ఉంటుంది వాటిపై అవగాహన కల్పిస్తుందన్నారు. రైతులు మార్కెట్‌ను బట్టి పంటలు సాగు చేయాలన్నారు. రైతులకు అవసరమైన మద్దతు ధరలు ప్రభుత్వం కల్పిస్తుందని అందులో భాగంగానే దువ్వూరులో ఖరీఫ్ సీజన్ లో వరి ధాన్యం సేకరణ అలాగే రబీలో శనగల కొనుగోలు ప్రారంభించామని తెలిపారు. రైతులందరూ పెట్టుబడులకు అనుగుణంగా వ్యవసాయాన్ని అభివృద్ధి చేసుకోవాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో మీర్జఖాన్ పల్లె రైతులు, సిబ్బంది పాల్గొన్నారు.

## రెండు రోజులు రైతులకు శిక్షణ కార్యక్రమం

**వీరపునాయునిపల్లి మార్చి23, ప్రభాతవార్త:**



మండలం అనిమేల రైతు సేవా కేంద్రంలో సోమవారం ఆత్మ వారి సహకారంతో రైతులకు రెండు రోజులు శిక్షణ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. కార్యక్రమంలో కమలాపురం సహాయ వ్యవసాయ సంచాలకులు నరసింహారెడ్డి, మండల వ్యవసాయాధికారి శ్యామ్‌బాబుతో కలిసి పాల్గొన్నారు. కార్యక్రమంలో ప్రధానంగా భూసార యాజమాన్యం, ప్రకృతి వ్యవసాయం, సమగ్ర సస్యరక్షణ, సమగ్ర పోషక యాజమాన్యం గురించి రైతులతో చర్చించడం జరిగింది. సస్యరక్షణలో పర్యావరణానికి హాని చేయకుండా, మిత్ర పురుగులను సంరక్షించుకుంటూ, తమ కున్న ఆర్థిక వనరులతో చీడపీడలను నియంత్రించుకోవాలంటే జీవనియంత్రణ పద్ధతులు ఒక సమర్థవంతమైన ప్రత్యామ్నాయంగా రైతులకు అందుబాటులో ఉన్నాయి. ప్రకృతి వ్యవసాయం వలన నేల ఆరోగ్యంతో పాటు ఆరోగ్యకరమైన పంటను పొందవచ్చని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ వ్యవసాయ సహాయకులు షమిముల్లా మరియు రైతులు పాల్గొన్నారు.

## సీఎం సహాయక నిధి పేద ప్రజలకు వరం..

**యర్రగుంట్ల మార్చి 23 ప్రభాతవార్త:**



సీఎం సహాయనిధి పేదలకు ఒక వరంలాంటిదని యర్రగుంట్ల ఎన్డీఏ కూటమి మండల ఇంచార్జ్ మలిరెడ్డి మధుసూదన్ రెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో ముఖ్యమంత్రి సహాయనిధి కింద 16 మంది లబ్ధిదారులకు రూ.22లక్షల 75 వేల 922 వందల చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. ముఖ్యమంత్రి చంద్ర బాబునాయుడు సంక్షేమానికి పెద్దపీట వేస్తూ నిరంతరం ప్రజల కోసం శ్రమిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో తిప్పలూరు సొసైటీ మాజీ డైరెక్టర్ కత్తి వీర ప్రతాప్ రెడ్డి, యర్రగుంట్ల మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ జగదీశ్వర్ రెడ్డి, తుమ్మలపల్లె టిడిపి నాయకుడు గంగాధర్ రెడ్డి, సున్నపురాళ్లపల్లి సింగిల్ విండో మాజీ ప్రెసిడెంట్ దాసరి రాజారెడ్డి, టిడిపి నాయకులు గంగాధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రైళ్లలో చోరీలకు పాల్పడుతున్న వ్యక్తి అరెస్ట్

**యర్రగుంట్ల మార్చి 23 ప్రభాతవార్త:**



రైళ్లలో దొంగతనాలకు పాల్పడుతున్న వ్యక్తిని జీఆర్‌పీఎఫ్ పోలీసులు అరెస్టు చేశారు. సోమవారం జీఆర్పీఎఫ్ సీఐ సుధాకర్ రెడ్డి విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 19న గుంటూరు నుండి తాడిపత్రికి ధర్మవరం రైలులో వెళ్తున్న గుంటూరుకు చెందిన ఓ మహిళ వద్ద బంగారు నగలు చోరీ జరిగినట్లు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. ఈ ఘటన చోరీకి పాల్పడిన కేరళకు చెందిన మహమ్మద్ సవాద్‌ను అదుపులోకి తీసుకుని 75 గ్రాముల బంగారం రెండు మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకున్నట్లు సిఐ వివరించారు. ఈ చోరీలో పాల్గొన్న మరో ముగ్గురు నిందితుల కోసం గాలిస్తున్నామని మిగిలిన వారిని కూడా త్వరలోనే పట్టుకుంటామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జీఆర్పీఎఫ్ ఎస్పై భాస్కర్ రెడ్డి సిబ్బంది పాల్గొన్నారు.

## వినతి పత్రాలు స్వీకరించిన తహసీల్దార్

**దువ్వూరు, మార్చి 23, ప్రభాతవార్త:**



స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ప్రజల నుండి వివిధ రకాల వినతి పత్రాలను తహసిల్దార్ సంజీవరెడ్డి స్వీకరించారు. ఈ సందర్భంగా కొంత మంది రైతులు రీ సర్వేలో జరిగిన లోటుపాట్లను వివరించారు. అలాగే తమ కుల ధ్రువీకరణ పత్రాలు గతంలో తప్పుగా వచ్చాయని వాటిని సరి చేయాలని కొంతమంది విద్యార్థులు కోరారు. వాటిని సంబంధిత అధికారులకు పంపుతున్నామన్నారు. అనంతరం సిబ్బందిచే మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కార వేదికగాలో వచ్చే ప్రతి సమస్యను క్షుణ్ణంగా పరిశీలించి పరిష్కరించాలన్నారు. నిర్ణీత గడువులోగా వాటిని పూర్తి చేయాలి అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో సుబ్బారెడ్డి, ఏపీఓ లక్ష్మీనారాయణ, ఏఈలు సుబ్రహ్మణ్యం, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## భగత్ సింగ్ రాజ్ గురు సుగుదేవ్‌లు అమర్ రహే

**వేంపల్లె మార్చి 23 (ప్రభాత వార్త)**



భగత్ సింగ్ రాజ్ గురు సుగుదేవ్‌ల వర్ధనతి సందర్భంగా ఆమ్ ఆద్మీ పార్టీ జిల్లా కోఆర్డినేటర్ రహమతుల్లా జిల్లా కో కన్వీనర్ దాదాపీర్ పులివెందుల నియోజకవర్గం వేంపల్లెలోని ఆమ్‌ఆద్మీపార్టీ కార్యాలయంలో భగత్ సింగ్ రాజ్ గురు సుగుదేవ్ ల చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు ఈ సందర్భంగా రహంతుల్లా మాట్లాడుతూ ఆంగ్లేయుల కబంధహస్తాల్లో నుండి మన భారతదేశాన్ని సాధించుకునేందుకు ప్రాణాలు సైతం లెక్కచేయకుండా ప్రాణ త్యాగాలు చేసిన ఆనాటి యువత మన భగత్ సింగ్ రాజ్ గురు సుగుదేవులు అంటూ వారిని కొన్నాడారు మరి ఈనాటి పాలకులు దేశాన్ని దేశ ప్రజలను దోచుకుంటున్న ధోరణి చూస్తుంటే ఆంగ్లేయుల కంటే అన్యాయంగా ప్రవర్తిస్తున్న తీరు పట్ల ఈనాటి యువత మేలుకోవాలి దేశ ప్రజలను దోచుకుంటున్న అసమర్థత పాలకులను గద్దె దింపే దిశగా యువత ముందుకు రావాలని అందుకు ఆమ్ ఆద్మీ పార్టీ వేదికగా ఉందని యువతను ఉద్దేశించి పిలిపించారు ఈకార్యక్రమంలో వేంపల్లె ఆప్ సభ్యులు పిరుబాషా ఎస్ అండి గౌస్, తదితరులు పాలొగొన్నారు.

## నందలూరులో ప్రశిక్షణ మహా అభియాన్



నందలూరు, మార్చి 23 ప్రభాతవార్త :
మండలంలోని విష్ణు పారడైజ్ ఫంక్షన్ హాల్లో పండిట్ దీనదయాల్ ఉపాధ్యాయ ప్రశిక్షణ మహా అభియాన్ కార్యక్రమాన్ని రాజంపేట పార్లమెంటరీ జిల్లా అధ్యక్షులు సాయి లోకేష్ సూచనల మేరకు బీజేపీ మండల నాయకులు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భారతీయ జనతా పార్టీ ప్రపంచంలో అతి పెద్ద రాజకీయ పార్టీగా నిలిచిందని, పార్టీ సిద్ధాంతాలు, ప్రాధాన్యతలపై నాయకులు వివరించారు. కార్యక్రమంలో రాష్ట్ర ఓబీసీ మోర్చా ప్రధాన కార్యదర్శి బండి ఆనంద్, రాష్ట్ర మైనారిటీ ఉపాధ్యక్షులు షబ్బీర్ అహ్మద్, రాజంపేట అసెంబ్లీ కన్వీనర్ రామ్ జగదీష్ స్వామి, జిల్లా ఎగ్జిక్యూటివ్ సభ్యుడు విఠలాచార్య స్వామి, జిల్లా కార్యదర్శి నరేంద్ర రాజు, మాజీ ఉపాధ్యక్షులు సురేష్ రాజు, నందలూరు మండల సహకార బ్యాంక్ డైరెక్టర్ ఆంధ్ర శివారెడ్డి, మండల అధ్యక్షుడు మక్క శ్రీనివాసులు, ఉపాధ్యక్షులు సివి సుబ్బయ్య, దాసరి వెంకటరమణ గౌడ్, మండెం నాగేంద్ర, ప్రధాన కార్యదర్శి రాజబోయిన మహేష్, యువ నాయకులు వీరబల్లి జయకుమార్ రెడ్డి, అనిల్, హేమంత్, హరి, కార్యక్రమ కన్వీనర్ రాచారి మురళి తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా సీతారాముల కళ్యాణం



సిద్దవటం, మార్చి 23 ప్రభాతవార్త :
కోదండరామ వార్షికోత్సవాల సందర్భంగా సీతారాముల కళ్యాణం వైభవహితంగా జరిగింది మండలంలోని, మాధవరం, 1,2,3, వార్డు గ్రామంలో వెలిసిన శ్రీ కోదండరామ స్వామి ఆలయంలో సోమవారం ఉత్సవమూర్తుల విగ్రహాలకు కళ్యాణం నిర్వహించారు ఈ సందర్భంగా ఆలయ అర్చకులు శ్రీనివాసులు మాట్లాడుతూ శ్రీ కోదండరామస్వామి వార్షికోత్సవ బ్రహ్మోత్సవాల సందర్భంగా స్వామివారికి గణపతిపూజ, జీలకర్రబెల్లం ,మాంగళ్యధారణ, ముత్యాలతలంబ్రాలు వేద మంత్రాలచే మంగళ వాయిద్యాలు నడుమ సీతారాముల కళ్యాణం నిర్వహించి భక్తులకు అన్న ప్రసాదాలు ఏర్పాటు చేశామని తెలిపారు ఈ కార్యక్రమంలో కార్య నిర్వాహకులు జయరామయ్య లక్ష్మీ సాయిరాం భక్తులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

### నేల పరిరక్షణ - నీటి సంరక్షణలో

## హాఫ్ మూన్ మోడల్ కీలకం



కడప, మార్చి 23 ప్రభాతవార్త :
మైదుకూరు మండలం, నీలాపురం గ్రామం రైతు సాధికార సంస్థ ఆధ్వర్యంలో కడప జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ శ్రీ ప్రవీణ్ కుమార్ నాయకత్వంలో నీలాపురం గ్రామానికి చెందిన రైతు సూర్యనారాయణరెడ్డి పొలంలో 'హాఫ్ మూన్ మోడల్' పై ప్రాక్టికల్ శిక్షణ కార్యక్రమం నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి ముందు మోడల్ మేకర్స్ అందరూ అనంతపురంలో చీఫ్ టెక్నికల్ ఇన్నోవేషన్ ఆఫీసర్ వద్ద హాఫ్ మూన్ మోడల్ పై ప్రత్యేక శిక్షణ పొందారు. అదే శిక్షణను జిల్లాలోని అన్ని డివిజన్లకు విస్తరించాలనే ఉద్దేశంతో ప్రతి డివిజన్‌లో ప్రదర్శనలు నిర్వహిస్తున్నారు. ముఖ్యంగా ఈ హాఫ్ మూన్ మోడల్ ద్వారా నీటి సంరక్షణ, నేల కోత తగ్గింపు, మరియు పంట దిగుబడి పెరుగుదల సాధ్యమవుతుందని తెలిపారు. వర్షాధార మరియు వాలు (స్లోపీ) భూముల్లో ఈ విధానం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని సూచించారు. అదేవిధంగా విత్తనాలను గులికల రూపంలో తయారు చేసి వినియోగించడం ద్వారా మొలకెత్తే శాతం పెరగడంతో పాటు పంట స్థిరత్వం మరింత మెరుగుపడుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు మరియు కేడర్ సభ్యులు పాల్గొని ప్రత్యక్షంగా శిక్షణను పొందారు.

### అధికారులూ

## గొంతెండి పోతోంది. స్పందించండి..



సుండుపల్లి, మార్చి 23,ప్రభాతవార్త :
మండలం పరిధిలోని అక్కంపల్లి గ్రామంలో గత 20 రోజులుగా త్రాగునీటి కొరత తీవ్రంగా ఉంది. ఈ సమస్యపై గ్రామస్తులు పలుమార్లు సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేసినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆరోపిస్తున్నారు. అధికారులను సంప్రదించిన సమయంలో మీరు చందాలు వేసుకుని బోర్ వేయించుకోండి, తర్వాత బిల్లులు మంజూరు చేస్తాం" అనే సమాధానం ఇవ్వడం గ్రామస్తుల్లో ఆగ్రహాన్ని రేకెత్తించింది. ఆర్థికంగా బలహీనంగా ఉన్న తాము బోర్ వేయించే స్థోమత లేక ఇబ్బందులు పడుతున్నామని వారు తెలిపారు. తాగునీటి సమస్య పరిష్కారం కోసం పంచాయతి కార్యాలయానికి వెళ్లినా ఎవరూ స్పందించలేదని గ్రామస్తులు వాపోయారు. కూలి పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్న తమకు కనీసం త్రాగునీరు కూడా అందకపోవడం బాధాకరమని పేర్కొన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తక్షణ చర్యలు తీసుకుని గ్రామంలో త్రాగునీటి సమస్యను పరిష్కరించాలని అక్కంపల్లి గ్రామ ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

## పరిశుభ్రతతోనే మెరుగైన ఫలితాలు

వాల్మీకిపురం మార్చి 23, ప్రభాతవార్త
ఆసుపత్రిని పరిశుభ్రంగా పెట్టుకుంటేనే వైద్య పరంగా మనకు మెరుగైన ఫలితాలు సాధ్యం అవుతాయని మాతృ శిశు ఆరోగ్య విభాగం అదనపు డైరెక్టర్ అనిల్ కుమార్ అన్నారు. కాయకల్ప కార్యక్రమం ఎస్క్యుఏఎస్ కార్యక్రమంలో భాగంగా సోమవారం స్థానిక ప్రభుత్వాసుపత్రిని అనిల్ కుమార్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆసుపత్రి తో పాటు పరిసర ప్రాంతాలన్నీ ఆయన సిబ్బందితో కలిసి పరిశీలించారు. పరిసరాలు,పారిశుధ్యం, రోగుల సేవలు, నిర్వహణ విధానాల గురించి సమగ్రహంగా పరిశీలించారు. ఆసుపత్రి అభివృద్ధికి తీసుకోవలసిన మార్గదర్శకత్వం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో మెడికల్ సూపర్డెంట్ మాలతి, సిబ్బంది సుధాకర్, వైద్యులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

## నాయునిపల్లెలో శ్రీ కళ్యాణరామ స్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం

### ఘనంగా - మూడు రోజులపాటు భక్తి, సాంస్కృతిక కార్యక్రమాలు





కాశినాయన మార్చి 23. ప్రభాతవార్త:
మండలం నాయునిపల్లె (హరిజనవాడ) గ్రామంలో శ్రీ కళ్యాణరామ స్వామి నూతన విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం ఘనంగా నిర్వహించేందుకు గ్రామ పెద్దలు, గ్రామ ప్రజలు విస్తృత ఏర్పాట్లు చేశారు. మార్చి 23 నుండి 25 వరకు మూడు రోజులపాటు ఈ మహోత్సవం ఆధ్యాత్మిక కార్యక్రమాలతో పాటు సాంస్కృతిక వేడుకలతో జరగనుంది.మొదటి రోజు సోమవారం ఉదయం గంగా నయనము, గణపతి పూజ, యాగశాల ప్రవేశం, కలశస్థాపన, రుద్రాభిషేకం వంటి పూజా కార్యక్రమాలు నిర్వహించబడతాయి. సాయంత్రం అంకురారోహణం, అగ్ని ప్రతిష్ట, హోమాలు జరుగుతాయి. రాత్రి 9 గంటలకు మున్నెల్లి పెద్ద ఓబులేసు ఆధ్వర్యంలో కులుకు భజన, కోలాటం వంటి సాంప్రదాయ కార్యక్రమాలు ఆకట్టుకోనున్నాయి.రెండవ రోజు మంగళవారం పూజలు, హోమాలు, చండీ హోమం వంటి విశేష కార్యక్రమాలు జరుగుతాయి. సాయంత్రం మహాస్నపన, క్షీరాభిషేకం, కుంకుమార్చన నిర్వహిస్తారు. రాత్రి శ్రీ రామాంజనేయ యుద్ధ సీను మరియు భక్త చింతామణి పూర్తి నాటక ప్రదర్శన శ్రీ సాయి నాట్య కళాసమితి ఆధ్వర్యంలో జరుగనుంది.మూడవ రోజు బుధవారం ఉదయం విగ్రహ ప్రతిష్ట, ప్రాణ ప్రతిష్ఠ, శిఖర కలశ ప్రతిష్ఠ, ధ్వజారోహణం, శ్రీ సీతా రాముల కళ్యాణం వైభవంగా నిర్వహిస్తారు. సాయంత్రం గుండు సందెం వంటి కార్యక్రమాలు ఉంటాయి. ఈ మూడు రోజులపాటు అన్నదాన కార్యక్రమం కూడా నిర్వహించబడుతుంది. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని నిర్వాహకులు ఆహ్వానిస్తున్నారు.

## ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన

పీలేరు, మార్చి 23 ప్రభాతవార్త:
పట్టణంలోని తిరుపతి రోడ్డు మార్గంలో అపొస్తలుల క్రైస్ట్ లవ్ మినిస్ట్రీట్రస్ట్ (ఏసీఎల్ఎం) చర్చి పాస్టర్ జార్మియా ఆధ్వర్యంలో నిర్వహించిన కంటి వైద్య శిబిరానికి స్పందన లభించింది. సోమవారం నిర్వహించిన కంటి వైద్య శిబిరంలో సుమారు 100 మంది హాజరు కాగా చెన్నైకి చెందిన అగర్వాల్ కంటి ఆస్పత్రి వైద్యులు పరీక్షలు నిర్వహించి 40 మందిని కంటి ఆపరేషన్ కు ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అగర్వాల్ కంటి ఆస్పత్రి ఎగ్జిక్యూటివ్ ఆంజినేయులు, డాక్టర్ ప్రగతి, అగస్టీన్, గౌతం తదితరులు పాల్గొన్నారు.



## పిజిఆర్ఎస్ అర్జీలపై ప్రత్యేక దృష్టి పెట్టాలి

మదనపల్లె, మార్చి 23 ప్రభాతవార్త :
పిజిఆర్ఎస్‌లో వచ్చే ప్రజా సమస్యల అర్జీలను పెండింగ్ లేకుండా సకాలంలో పరిష్కరించేందుకు అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని జిల్లా కలెక్టర్ నిశాంత్‌కుమార్ తెలిపారు. సోమవారం మదనపల్లె కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజాసమస్యల పరిష్కార వేదికలో జిల్లాలోని వివిధ మండలాలకు చెందిన ప్రజలు వివిధ సమస్యలపై జిల్లా కలెక్టర్‌కు అర్జీల రూపంలో విన్నవించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ పిజిఆర్ఎస్ సమస్యలకు సంబంధించి ముఖ్యమంత్రి ఉన్నతాధికారులతో సమీక్షలు చేస్తున్నారని అధికారులు వెంటనే స్పందించి సకాలంలో అర్జీల పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. ఆయా శాఖల పరిధిలో పిజిఆర్ఎస్ గ్రీవెన్స్‌పై ఆడిట్ నిర్వహించాలన్నారు. అర్జీదారులతో నేరుగా మాట్లాడి ఎప్పటికప్పుడు సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. డివిజన్, నియోజకవర్గ, మండల స్థాయి అధికారులు వారికి కేటాయించిన మండలాలను, గ్రామాల్లో పర్యటించి అక్కడి సమస్యలను తెలుసుకొని పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. పిజిఆర్ఎస్‌లో ప్రజల నుంచి సుమారు 332అర్జీలు వచ్చినట్లు తెలిపారు. ప్రధానంగా అంగన్‌వాడీ టీచర్ రాజేశ్వరి, చెల్లెలు ప్రభావతమ్మ, భర్త క్రిష్ణారెడ్డిలు రూ.80లక్షలు చీటి డబ్బులు ఇవ్వాలని బాధితులు జంగాల లక్ష్మి, సుకన్య, దేవేంద్రలు కలెక్టర్, ఎస్పిలకు విన్నవించారు. ప్రధానంగా సంక్షేమ పథకాలు, భూ సమస్యలపై ఫిర్యాదులు వచ్చాయన్నారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ శివనారాయణశర్మ, సబ్‌కలెక్టర్ చల్లా కళ్యాణి, ఏడి సర్వేయర్ భరత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



అర్జీలు స్వీకరిస్తున్న కలెక్టర్

## ఆసుపత్రి అభివృద్ధి పనుల జాప్యంపై ఎమ్మెల్యే అసంతృప్తి

### సేవలు మెరుగుపరచాలని స్థానిక వైద్యులకు సూచించిన ఎమ్మెల్యే వరద

ప్రొద్దుటూరు మార్చి 23 ప్రభాతవార్త
ప్రభుత్వ ఆసుపత్రిలో చేపట్టిన అభివృద్ధి పనులు వేగవంతం చేయడంలో అధికారుల నిర్లక్ష్యంపై ఎమ్మెల్యే నంద్యాల వరదరాజుల రెడ్డి అసంతృప్తి వ్యక్తం చేశారు. సోమవారం జిల్లా ప్రభుత్వాసుపత్రిని ఆయన సందర్శించి పలు విభాగాలను పరిశీలించి వైద్య సేవలపై రోగులతో మాట్లాడారు ఆసుపత్రిలో అందుతున్న సేవలు సమస్యలు తదితర వాటిపై చర్చించారు జిల్లా ఆస్పత్రి అభివృద్ధి కోసం సుమారు 20 కోట్ల రూపాయల మంజూరు అయినప్పటికీ పనులు మందకొడిగా సాగడం పై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు దీంతో ఎమ్మెల్యే వరదరాజు రెడ్డి ఏపీఎంఎస్ఐడిసి సూపరింటెండెంట్ ఇంజనీర్ లక్ష్మీపతి రెడ్డి ఈ ఈ లతో ఫోన్లో సంప్ర గత ఐదు ఆరు నెలల నుంచి కంటి వైద్య విభాగంలో పనులు ముందుకు సాగక వైద్య సేవలు నిలిచిపోవడానికి కారణాలపై ఆరా తీశారు కంటి వైద్య విభాగం ఆధునీకరణ క్రమంలో పనులను మొదలుపెట్టి మధ్యలోనే వదిలేసిన నేపథ్యంలో ఆయన అసంతృప్తిని వ్యక్తపరుస్తూ రెగ్యులర్ కాంట్రాక్టర్ పనులు చేస్తారా లేదంటే మానుకుంటారా వేరే వారి చేతనైన చేయించుకుంటామంటూ ఘాటుగా స్పందించారు ఈ క్రమంలో కంటి వైద్య విభాగంలో సేవలు స్తంభించాయని శాస్త్ర చికిత్సలు జరగడంలేదని తాను ఇప్పటికి రెండు మూడు సార్లు ఫోన్లలో విషయాన్ని తెలియజేసిన సరైన స్పందన లేకపోవడం ఏంటని ప్రశ్నించారు. అధికారుల కంట్రోల్లో లేనివారు అవసరం లేదని తాను ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేసిన పనులను త్వరగా చేయించి ప్రజలకు వైద్య సేవలు అందేలా చర్యలు చేపడతానని చెప్పారు జిల్లా ఆసుపత్రిలో నెలకొన్న నర్సింగ్ సిబ్బంది సహాయకుల పెంపు కోసం చర్యలు చేపట్టామని త్వరలో పోస్టుల నియామకాన్ని మట్టి చేసి చేసి పూర్తిస్థాయిలో సిబ్బందిని అందుబాటులో ఉండేలా చర్యలు చేపడతామన్నారు. ఆసుపత్రిలో వైద్య సేవలు మెరుగుపరచాలని ఓపిని పెంచే దిశగా చర్యలు చేపట్టాలని స్థానిక వైద్యాధికారులకు సూచించారు ఈ కార్యక్రమంలో మెడికల్ సూపర్ అంటే డాక్టర్ ఆనందబాబు ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యుడు బద్వేల్ శ్రీనివాసులు రెడ్డి డాక్టర్ రూప ఆనంద్ డాక్టర్ గోపాల్ ఇతర వైద్యులు సిబ్బంది పాల్గొన్నారు.



## మేకవారిపల్లి గ్రామంలో లేగ దూడల ప్రదర్శన కార్యక్రమం

పోరుమామిళ్ల రూరల్, మార్చి 23 ప్రభాతవార్త :
బి.కోడూరు మండల పరిధిలోని మేకవారిపల్లి గ్రామంలో సోమవారం రాష్ట్రీయ గోకుల్ మిషన్ ఆంధ్రప్రదేశ్ పశుసంవర్ధక శాఖ, పశుగణాభివృద్ధిసంస్థ ఆధ్వర్యంలో కృత్రిమ గర్భదారణ ద్వారా పుట్టిన లేగ దూడల ప్రదర్శన కార్యక్రమం నిర్వహించారు.ఈ కార్యక్రమములో 66 కృత్రిమ గర్భదారణ ద్వారా పుట్టిన దూడలను ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో దూడలను పరిశీలించి ఆరోగ్యవంతంగా ఉండే దూడలకు మొదటి బహుమతి రెండో బహుమతి మూడో బహుమతి దూడల యజమానులకు అందజేశారు అదేవిధంగా ఈ కార్యక్రమంలో పాల్గొన్న మిగతా రైతులకు కూడా కాల్షియం టానిక్, మినరల్ బ్లాక్స్ బహుమతులు ఇచ్చి ప్రోత్సహించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ రాజ తిమ్మారెడ్డి, జిల్లా పశుఘనాభివృద్ధి అధికారి ఈ సందర్భంగా మాట్లాడుతూ పశువులలో ఎద లక్షణాలు, లింగ నిర్ధారిత వీర్యం ప్రాముఖ్యతను వివరించారు. అనంతరం లింగ నిర్ధారిత వీర్యం వల్ల ఉపయోగాలు వాటినీ విరివిగా రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. సహాయ సంచాలకులు, పశువులలో మేలైన యాజమాన్య పద్ధతులు, ఎడాది కి ఒక దూడ, రైతు 150 చెలిస్తే లింగ నిర్ధారిత వీర్యం ప్రభుత్వం అందిస్తోంది. వాటినీ రైతు సోదరులు ఉపయోగించుకోలన్నారు. హేమలత మాట్లాడుతూ లేగ దూడల సంరక్షణ, దూడల యాజమాన్య పద్ధతులు, ముర్రుపాల ఆవశ్యకత వివరించారు. ఈ కార్యక్రమములో సర్పంచ్, మండల ఉపాధ్యక్షులు, పశుసంవర్ధక శాఖ సిబ్బంది, రైతులు, తదితరులు పాల్గొనారు.




## ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం జనగణన

కడప, మార్చి 23 ప్రభాతవార్త :
ప్రభుత్వ మార్గదర్శకాల ప్రకారం 2027 జనాభా గణనను సమగ్రంగా డిజిటల్ విధానంలో నిర్వహించనున్నట్లు జిల్లా రెవెన్యూ అధికారి మరియు జిల్లా గణన అధికారి విశ్వేశ్వర నాయుడు తెలిపారు. సోమవారం కలెక్టరేట్ లోని పిజిఆర్ఎస్ హాలులో భారత సెన్సస్-2027 జనగణన కార్యక్రమం నిర్వహణకు సంబంధించి.. మూడవ స్థాయి శిక్షణలో భాగంగా ఫీల్డ్ ట్రైనర్లకు శిక్షణ కార్యక్రమం జిల్లా కేంద్రంలో ప్రారంభమైంది. ఈ శిక్షణ కార్యక్రమానికి డీఆర్ఓ విశ్వేశ్వర నాయుడు ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా డిఆర్వో మాట్లాడుతూ.. మే 1 నుండి 30 వరకు నిర్వహించనున్న జిల్లాలో జరగనున్న సర్వే కి సంబంధించి ఫీల్డ్ ట్రైనర్స్ కు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. 2027 జనాభా గణన రెండు దశల్లో జరుగుతుందని తెలిపారు. మొదటి దశలో ఇండ్ల జాబితా మరియు ఇండ్ల గణన మరియు రెండవ దశలో జనాభా గణన నిర్వహించబడుతుందన్నారు. రెండవ దశలో కుల గణన కూడా చేపట్టనున్నట్లు తెలిపారు. మొదటి దశను మే 1 నుంచి మే 30 వరకు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ఈ దశలో ఇంటి నిర్మాణానికి ఉపయోగించిన మెటీరియల్, ఇంటి పరిస్థితి, కుటుంబ యజమాని వివరాలు, త్రాగునీటి సౌకర్యం, మురుగునీటి పారుదల వ్యవస్థ, మరుగుదొడ్ల లభ్యత, వంటగది సౌకర్యం, అలాగే రేడియో, టెలివిజన్, స్మార్ట్‌ఫోన్, కంప్యూటర్, సైకిల్, కారు తదితర సౌకర్యాలకు సంబంధించిన మొత్తం 33 ప్రశ్నల వివరాలను ఎన్యుమరేటర్ ప్రతి ఇంటికి వెళ్లి సేకరించే విధానాన్ని వివరించనున్నట్లు తెలిపారు. అలాగే, ప్రజలు తమ వివరాలను తామే స్వయంగా ఆన్లైన్లో నమోదు చేసుకొనే విధముగా ప్రత్యేక పోర్టల్ 15 రోజులు ముందుగానే అందుబాటులో వుంటుందన్నారు. సాంకేతిక ఆధారిత డేటా సేకరణపై ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. డిజిటల్ సాంకేతికతల్లో సమాచార సేకరణ, డేటా ఎంట్రీలో ఖచ్చితత్వం, ఫీల్డ్ స్థాయి ధృవీకరణ ప్రక్రియలు వంటి వాటికి ప్రత్యేకంగా శిక్షణ ఇచ్చారు. ఆధునిక సాఫ్ట్‌వేర్ వ్యవస్థల వినియోగంతో పారదర్శకత, వేగం, విశ్వసనీయత పెరుగుతాయని నిపుణులు వివరించారు.ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతతో సెన్సెస్ ఆఫ్ ఇండియా విభాగం నుండి ప్రత్యేక అధికారుల ద్వారా ఈ శిక్షణా కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జిల్లాలో నిర్వహించే జనగణన సర్వే నిర్వహణపై జిల్లా, మున్సిపల్, ఛార్జ్ లెవెల్ సెన్సెన్ సర్వే నిర్వాహకులకు పూర్తి స్థాయిలో అవగాహన కల్పించడం జరుగుతోందన్నారు. ఈ శిక్షణలో జనాభా గణన జిల్లా ఇంచార్జి మరియు మాస్టర్ ట్రైనర్ మోహన్ రమణ మాట్లాడుతూ ఫీల్డ్ ట్రైనర్స్ విధివిధానాలు మరియు భాద్యతల గురించి పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరించనున్నట్లు తెలిపారు. 15 సంవత్సరాలకు ఒకసారి నిర్వహించే ఈ జన గణన కార్యక్రమం 2027 ఇప్పటి వరకు 16 గణాంక సర్వేగా నమోదవుతుందన్నారు. స్వాతంత్ర్యానంతరం 1952 మొదటగా ప్రారంభం కాగా ప్రస్తుతం 8వ జన గణన కార్యక్రమం నిర్వహించుకోవడం జరుగుతోంది. రూ. 13 వేల కోట్ల అంచనా వ్యయంతో.. 16 ప్రాంతీయ భాషల్లో డిజిటల్ విధానంలో కేంద్ర ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యతతో నిర్వహించడం జరుగుతోందన్నారు. కడప జిల్లాకు సంబంధించిన మొత్తం 98 మంది ఫీల్డ్ ట్రైనర్లు ఈ శిక్షణలో పాల్గొంటున్నారన్నారు. వీరు శిక్షణ పూర్తిచేసుకున్న అనంతరం, ఏప్రిల్ నెలలో మండల స్థాయిలో ఎన్యుమరేటర్లు మరియు సూపర్వైజర్లకు శిక్షణ ఇవ్వనున్నారు. కాగా మాస్టర్ ట్రైనర్లు ప్రొఫెసర్లు శ్రీనివాసులు, సుదర్శన్ రెడ్డి, ఆదిలక్ష్మి, ఫీల్డ్ ట్రైనర్లకు శిక్షణ అందించారు. ఈ కార్యక్రమంలో జిల్లా జనగణన ఇన్‌చార్జ్ మోహన్ రమణ, డిప్యూటీ కలెక్టర్ కిరణ్ కుమార్. తదితరులు పాల్గొన్నారు.




## బెస్ట్ స్కూల్ ఇన్ అవార్డు రావడం గర్వకారణం

వేంపల్లె:మార్చి 23(ప్రభాత వార్త )
పట్టణంలోని పాత గండి రోడ్డు నందు గల నారాయణ ఇంగ్లీష్ మీడియం పాఠశాల జిల్లా స్థాయిలో ఉత్తమ పాఠశాలగా గుర్తింపు పొందినట్లు నారాయణ విద్యాసంస్థల అధినేత కొట్టె నారాయణ రెడ్డి తెలిపారు. సోమవారం ఆ పాఠశాలలో నిర్వహించిన ప్రత్యేక కార్యక్రమంలో పాఠశాలకు"బెస్ట్ స్కూల్ ఇన్ కడప డిస్ట్రిక్ట్" అవార్డు ప్రదానం చేయబడింది. ఈ సందర్భంగా పాఠశాల ప్రతినిధులు ట్రోఫీ మరియు మొమెంటోలను స్వీకరించారు. అనంతరం కొట్టె నారాయణరెడ్డి మాట్లాడుతూ ఈ విజయానికి పాఠశాల యాజమాన్యం, ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు మరియు విద్యార్థుల సమిష్టి కృషి ప్రధాన కారణమని తెలిపారు. విద్యా ప్రమాణాలు, సాంస్కృతిక కార్యక్రమాలు మరియు సమగ్ర అభివృద్ధి పరంగా ఈ పాఠశాల ప్రత్యేక గుర్తింపు పొందిందని తెలిపారు. పాఠశాల యాజమాన్యం మాట్లాడుతూ, భవిష్యత్తులో మరింత మెరుగైన ఫలితాలు సాధించేందుకు కృషి చేస్తామని తెలిపారు. స్థానిక ప్రజలు, తల్లి దండ్రులు మరియు విద్యార్థులు ఈ విజయంపై హర్షం వ్యక్తం చేశారు.



## మైఫోర్స్ మహేష్ జన్మదిన వేడుకలు



మదనపల్లెక్రైమ్, మార్చి 23 ప్రభాతవార్త.
జనసేన పార్టీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి, ఏపీఐఐసీ డైరెక్టర్ మైఫోర్స్ మహేష్ జన్మదిన వేడుకలు సోమవారం మదనపల్లెలో ఘనంగా జరిగాయి. జనసేన పార్టీ కార్యాలయంలో ఉదయం భారీ రక్తదాన శిబిరాన్ని నిర్వహించి, కేక్ కటింగ్ తో వేడుకలను ప్రారంభించారు. అనంతరం సిద్ధమ్మగారిపల్లి ఫుట్ బాల్ గ్రౌండ్‌లో పవన్ అన్న వృక్ష రక్షణ పేరుతో మొక్కలు నాటే కార్యక్రమాన్ని మైఫోర్స్ మహేష్ ప్రారంభించారు. సెప్టెంబర్ 2 వరకు ఉమ్మడి జిల్లాలోని ఐదు నియోజకవర్గాల్లో 5000 మొక్కలు నాటడమే లక్ష్యమని ఆయన పేర్కొన్నారు. కురపర్తి చైతన్య అనాథాశ్రమం లో చిన్నారులకు, వృద్ధులకు అన్నదానం చేశారు. అలాగే చిత్తూరు బస్టాండ్, నీరుగుట్టువారిపల్లి సర్కిల్ నందు బాణసంచా కాల్చి, ప్రజలకు భారీగా అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. మంజునాథ స్వామి ఆలయంలో ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి భక్తులకు ప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన లీగల్ సెల్ అధ్యక్షులు అమర్ నారాయణ, స్పోర్ట్స్ అథారిటీ చైర్మన్ మహేందర్ గౌడ్, నాయకులు సందీప్ రెడ్డి, రమణారెడ్డి, హరినాథ్, శోభ, జయ భవ్య, మదనపల్లె, తంబళ్ళపల్లి, పీలేరు, రాయచోటి నియోజకవర్గాల జనసైనికులు, మైఫోర్స్ సభ్యులు పాల్గొన్నారు.

### వయోజనులు

## ఆర్థిక అక్షరాస్యత కలిగి ఉండాలి



తంబళ్లపల్లె మార్చి 23 ప్రభాతవార్త ః
వయోజనులు ఆర్థిక అక్షరాస్యత పై అవగాహన కలిగి ఉండాలని విడ్స్, సి ఎఫ్ ఎల్ ప్రతినిధి శ్రీనివాస్ పిలుపునిచ్చారు. సోమవారం ఎంపీడీవో కార్యాలయంలో సీనియర్ సిటిజెన్లకు ఆర్థిక అక్షరాస్యత అవగాహన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ బ్యాంకుల్లో అకౌంట్ చేసుకొని కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన భీమా పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఇందుకు వాలంటరీ ఇంటిగ్రేటెడ్ సొసైటీ మరియు ఆర్థిక అక్షరాస్యత కేంద్రాలు సహకరిస్తాయి అన్నారు. బీమా పథకాలపై అవగాహన పెంచుకోవాలని అదేవిధంగా సైబర్ నేరాలు, లోన్ యాప్స్, బెట్టింగ్ యాప్స్, నష్టాలపై అప్రమత్తంగా ఉండాలని ఇందుకు సంబంధించి పలు సలహాలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో బాపూజీ పట్నాయక్, ఏవో థామస్ రాజా, డిప్యూటీ ఎంపీడీవో ప్రసాద్, సి ఎల్ ఎఫ్ ప్రతినిధి హరికృష్ణ, కార్యదర్శి శ్రీనివాసులు, పద్మావతి, భాస్కర్ సీనియర్ సిటిజెన్లు పాల్గొన్నారు.

## సూపరిపాలన అందించడమే లక్ష్యం

చిన్నమండెం మార్చి 23 ప్రబాతవార్త:
సోమవారం ఉదయం మండలంలోని బోరెడ్డిగారిపల్లిలో మంత్రి స్వగృహం నందు జిల్లా నలుమూలల నుండి వచ్చిన అధికారులు ప్రజలతో మంత్రి మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి ప్రజా దర్బార్ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల సమస్యలు,అభ్యర్థనలు, వినతులు స్వయంగా విని తక్షణ చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.ప్రజలకు అందుబాటులో ఉండి, సమస్యల పరిష్కారం కోసం కృషి చేయడం తమ ప్రధాన లక్ష్యమని మంత్రి తెలిపారు.ఈ సందర్భంగా పలువురు కలిసి తమ సమస్యలను వివరించగా, వాటిని పరిష్కరించేందుకు హామీ ఇచ్చారు.ఈ సందర్భంగా కొంతమంది అధికారులు ప్రజలు దుశ్యాలువ పుష్పగుచ్చములతో మంత్రిని సత్కరించినారు.

